



# పెన్ పవర్

## తెలంగాణ రౌండప్

సోమవారం | 12 మే 2025 | పేజీలు 8


- దుండిగల్ మున్సిపల్ బౌరంపేట్ సింహపురి కాలనీలో పార్కులు బహిరంగ విక్రయం..
- 1998లో లేఅవుట్ పార్కులను 2024 లో అక్రమ రిజిస్ట్రేషన్లు..ఫెన్సింగ్ ఏర్పాటు..
- పెన్ పవర్ దినపత్రికలో గతేడాది 2024 ఆగష్టు 28న వార్తా కథనం..
- 2024 ఆగష్టు 29న టౌన్‌ప్లానింగ్ అధికారి సమక్షంలో ఫెన్సింగ్ కూల్చివేతలు..
- పార్కుస్థలాల తప్పుడు రిజిస్ట్రేషన్‌లను పట్టించుకోని దుండిగల్ మున్సిపాలిటీ..
- నేటికీ రిజిస్ట్రేషన్‌ల రద్దుకు చర్యలు చేపట్టని దుండిగల్ మున్సిపల్ అధికారులు..
- సంబంధిత అధికారులతో పాటు..! హైడ్రా చుట్టూ తిరుగుతున్న కాలనీ ప్రజలు..
- ఏమి పట్టనట్టు వ్యవహరిస్తున్న కాలనీ అసోసియేషన్ సభ్యుల బాధ్యతా రహితం..
- అసలు సూత్రదారులే అసోసియేషన్ సభ్యులు అంటూ ఆరోపణలు..?
- బ్లాకులన్నింటికీ ఒకే అసోసియేషన్ పెత్తనం..! 'డి' బ్లాకు పార్కుని కమర్షియల్ చేసే యోచన.
- తాము పార్కులను చూసే ప్లాట్‌లు కొనుగోలు చేశామని కాలనీ ప్రజల ఆవేదన..

# "హుడా" లేఅవుట్‌లో... ప్రజాప్రయోజనాలు రిజిస్ట్రేషన్..!

- గ్రామపంచాయతి బోర్డులు పెట్టిన ఖాళీ స్థలాలు కబ్జా..
- బై నెంబర్‌లతో రిజిస్ట్రేషన్‌లు చేసి విక్రయాలు..
- పార్కుస్థలం కొనుగోలు దారుడే.. కబ్జాపై ఫిర్యాదు చేసినోళ్ళకి షోకాజ్ నోటీసులు..
- నిద్రావస్థలో దుండిగల్ మున్సిపల్.. మేడ్చల్ జిల్లా "లోకల్‌బాడీ"..
- పార్కు స్థలాల రిజిస్ట్రేషన్‌లపై హైడ్రా కమిషనర్ జోక్యం చేసుకోవాలని విజ్ఞప్తి..

- బౌరంపేట్ సింహపురి కాలనీలో హుడా లేఅవుట్‌లో పార్కు స్థలాలు విక్రయం..
- 1998 ఫిబ్రవరి 23న "హుడా" ఆమోదం పొందిన లేఅవుట్ పార్కులకి ఎసరు..
- "ఏ నుండి ఎఫ్" వరకు బ్లాకులుగా విభజించిన వెంచర్ నిర్వాహకులు..
- పార్కులు, ప్రజా ప్రయోజనాలకు వదిలిన ఖాళీ స్థలాలపై రాబందుల కన్ను..
- వెంచర్ నిర్వహకుల్లో ఒకరి నిర్వాకం.. ఈ పార్కు స్థలాల విక్రయాలకు శ్రీకారం..


బౌరంపేట్ సింహపురి కాలనీ వీవ్..

కబ్జాకు కాదేది అనర్హం..! ప్రభుత్వ భూములైనా..! పార్కు స్థలాలు అయినా..! కబ్జా చేయడమే ప్రధాన లక్ష్యం.. ఈ వ్యవహారంలో కాలనీ అసోసియేషన్‌లతో పాటు సంబంధిత అధికారుల ప్రమేయం కూడా ఉన్నట్టు ఆరోపణలు వస్తున్నాయి.. మరోవైపు పార్కు స్థలాలు, చెరువుల పరిరక్షణా పేరుతు ఏర్పాటైన "ఆపరేషన్ హైడ్రా" కూడా ఎప్పటి కప్పుడు హెచ్చరించినా, అధికారులు చూసీ చూడనట్టు వ్యవహరించడం, అక్రమార్కులు బరితెగిస్తున్నారు. దుండిగల్ మున్సిపాలిటీలో గతంలో విధులు నిర్వర్తించిన కమిషనర్‌లు, టౌన్‌ప్లానింగ్ అధికారుల చేతివాటంతో, వారి నిర్లక్ష్యం ఏ మేరకు ఉందో చూడండి..!బహుదూర్‌పల్లి గ్రీన్‌హిల్స్ హౌసింగ్ కాలనీలోని 3600 గజాల పార్కుస్థలం గుర్తించిన అధికారులు..! ఫెన్సింగ్ వేయడానికి అసోసియేషన్‌కి లేఖను అందజేసిన అనంతరం.. కబ్జా చేసినోళ్ళకే ఇంటి అనుమతులు జారీచేసి పట్టంకట్టి అక్రమ నిర్మాణాలను ప్రోత్సహించారు.. ఇపుడు బౌరంపేట్ సింహపురి కాలనీకి చెందిన "హుడా" లేఅవుట్ ఓపెన్ ప్లాట్‌లు, ప్రజాప్రయోజనాలు సైతం విక్రయించి బై నెంబర్‌లతో రిజిస్ట్రేషన్‌ల ప్రక్రియ యధేచ్ఛగా కొనసాగుతుంది..ఈ విషయాన్ని దృష్టికి తీసుకెళ్ళినా చోద్యం చూస్తున్నారు.. సంబంధిత కబ్జసలను అనుమతులు తీసుకుని అక్రమ కట్టడాలు ప్రారంభించడమే తరువాయి.. ఈ వ్యవహారంలో దుండిగల్ మున్సిపల్ అధికారులు పట్టించుకోక పోవడం స్థానికులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.. మేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్, మే 11:

-2లో

# బాచుపల్లి తహశీల్దార్ నోటీసులకు.. హైడ్రాకు సంబంధం లేదు..!

## ఈటెల రాజేందర్ వ్యాఖ్యలపై.. హైడ్రా కమిషనర్ రంగనాథ్ ప్రకటన..

- ఎఫ్‌టిఎల్‌లో నిర్మాణాలకు బాచుపల్లి ఎమ్మార్వో నోటీసులు వివాదాస్పదం..
- బాచుపల్లి తహశీల్దార్ బాధితులకు అండగా ఉంటానని బీజేపీ ఎంపి భరోసా..
- ఆ క్రమంలోనే హైడ్రాపై ఈటల చేసిన వ్యాఖ్యలపై హైడ్రా కమిషనర్ వివరణ..
- నోటీసుల వ్యవహారం మేడ్చల్ జిల్లా కలెక్టర్‌కి కూడా తెలియదని కమిషనర్ తెలిపారు..
- కలెక్టర్‌కి కూడా తెలియకుండానే ఎమ్మార్వో నోటీసులిచ్చారని ఒకవైపు చెబుతూనే..
- నిబద్ధతో పని చేస్తున్న హైడ్రాను దోషిగా నిలబెట్టే ప్రయత్నాలు దురదృష్టకరం..

-3లో


హైడ్రా కమిషనర్ ఏ.వి.రంగనాథ్ ఐపీఎస్..

# యాదగిరిగుట్టలో ముగిసిన నరసింహ జయంతి ఉత్సవాలు



హైదరాబాద్ పెన్ పవర్:యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో నృసింహ జయంతి ఉత్సవాలు ఘనంగా ముగిశాయి. మూడవ రోజు (ఆదివారం, మే 11) విశేష తిరువారాధన, అర్చన, వేద స్వస్తి, నృసింహ ఆవిర్భావం, మహానివేదన, తీర్థ ప్రసాద గోష్టి తో ఉత్సవాలకు పరిసమాప్తి పలికారు అర్చకులు. ప్రముఖ పుణ్యక్షేత్రం యాదగిరిగుట్టలో లక్ష్మీనరసింహస్వామి జయంతి ఉత్సవాలు శుక్రవారం (మే 9)న మొదలైన ఉత్సవాలు మూడు రోజుల పాటు ఘనంగా జరిగాయి. తొలి రోజు ఉదయం 8:45 గంటలకు కొత్త గుట్ట,

-3లో

# "హుడా" లేఅవుట్‌లో.. ప్రజాప్రయోజనాలు రిజిస్ట్రేషన్..!



సింహపురి కాలనీ "డి-బ్లాక్‌లో పార్కు స్థలాన్ని కమర్షియల్ చేసేందుకు సిద్ధం..



పార్కు స్థలంగానే ఉంచాలని కోరుతున్న, డి-బ్లాక్ వాసులు..






ఎ-బ్లాక్‌లో 2024 ఆగష్టు 28న పార్కు స్థలం కబ్జాను టిపిఎస్ సమక్షంలో చర్యలు..

**దుండిగల్ మున్సిపల్ పరిధి బౌరంపేట్ సింహపురి కాలనీలోని పార్కు స్థలాలపై అధికారుల నిర్లక్ష్యం అక్రమార్కులకు వరంగా మారింది.. 1998 లో "హుడా" ఆమోదం పొందిన లేఅవుట్‌లో పార్కు స్థలాలు అన్యాక్రాంతం అవుతున్నాయి.. ఎ-బ్లాక్‌లో పార్కు స్థలం కబ్జాచేసి దర్జాగా రిజిస్ట్రేషన్ చేసుకున్న వ్యవహారంపై "పెన్ పవర్" దినపత్రికలో 2024 ఆగష్టు 28న వచ్చిన వార్తా కథనంతో, కమిషనర్‌తో కలిసి టౌన్‌ప్లానింగ్ అధికారిని సంజున ఆద్వర్యంలో పరిశీలించి కూల్చివేతలు చేపట్టిన అధికారులు అక్రమ రిజిస్ట్రేషన్ రద్దు చేయడానికి ప్రయత్నించక పోవడం విశేషం.. మరోవైపు అక్రమ రిజిస్ట్రేషన్ దారుడు హైకోర్టును సంప్రదించి 6 గురు రెస్పాండెంట్స్‌కి షోకాజ్ నోటీసులు పంపించడం గమనార్హం.. దీనంతటికి పార్కు కబ్జాను ప్రోత్సహించిన అధికారులే కారణంగా ఆరోపిస్తున్నారు.. 27 ఏళ్ళనాటి హుడా లేఅవుట్‌లోని పార్కులను, ప్రజా ప్రయోజనాల స్థలాలను కాపాడలేని అధికారులుగా పరిగణించాలా..? అధికారుల ప్రమేయం లేకుండా ఇదంతా సాధ్యమేనా..? పార్కుల ప్రత్యేక పరిరక్షణకై ఏర్పడిన హైడ్రా కమిషనర్ పట్టించుకోవాలని స్థానికులు వేడుకుంటున్నారు..**

- మొదటి పేజి తరువాయి

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా దుండిగల్ మున్సిపల్ పరిధి బౌరంపేట్ సింహపురి కాలనీ 1998 ఫిబ్రవరి 23న "హుడా" ఆమోదంతో లేఅవుట్ వేశారు..వెంచర్‌లో "ఏ నుండి ఎఫ్" వరకు బ్లాకులుగా విభజించిన వెంచర్ నిర్వాహకులు పార్కు స్థలాలతో పాటు.. భవిష్యత్తు ప్రజల వినియోగం దృష్ట్యా ఓపెన్ ప్లాట్‌లు, పార్కు స్థలాలను విశాలంగా కేటాయించారు.. "సర్వే నెం.440R, 441P, 442, 443, 444P నుండి 448P, 538B, 540 ఆఫ్ బౌరంపేట్ విలేజ్".. అండ్ బాచుపల్లి సర్వే నెంబర్ 149లో మొత్తం 89 ఎకరాల్లో 4,30,760 చదరపు గజాలతో వేసిన వెంచర్ నిర్మాణంలో.. 3.70 శాతం ప్రజా ప్రయోజనాల కోసం 15,950 చదరపు గజాలు కేటాయించారు.. 1998లో "హుడా" లేఅవుట్ పర్మిట్ నెం.12448/MP2/HUDA/1993.. ఆ తర్వాత రివైజ్డ్ పర్మిట్ నెం.12448/MP2/ H/ 1998 తేది:23-02-98.. దాదాపు 27 ఏళ్ళ క్రితం ఏర్పాటు చేసిన లేఅవుట్‌లోని ప్రజాప్రయోజనాలను, 2024 నుండి బై నెంబర్‌లతో రిజిస్ట్రేషన్‌లు చేస్తుంటే..! "పెన్ పవర్" దినపత్రికలో వచ్చిన వార్తా కథనంతో ప్రీకాస్ట్ ఫెన్సింగ్‌ను 24 ఆగష్టు 28న కూల్చివేసిన మున్సిపల్ అధికారులు, నేటికీ రిజిస్ట్రేషన్‌లు రద్దుచేయకుండా చోద్యం చూస్తున్నారు..




డి-బ్లాక్‌లో ఉన్న ఈ ప్రజా ప్రయోజనాలను రిజిస్ట్రేషన్‌లు చేశారని స్థానికు ఆరోపణ.. ఫైల్‌ఫోటో.

## ఎ-బ్లాక్‌లో పార్కు స్థలానికి..! "బై నెంబర్‌ల" తో గిఫ్ట్ రిజిస్ట్రేషన్..

బౌరంపేట్ సింహపురి కాలనీ సర్వే నెం.442, 443 ఏ-బ్లాక్‌లో 122 ప్లాట్ పక్కనే ఉన్న పార్కుస్థలంలో కొంత భాగం,111.80 గజాలు విభజించి..! లేఅవుట్ ప్లాట్ నెంబర్ (122)ను బై నెంబర్ 122/1 గా దయాకర్ రెడ్డి అనే వ్యక్తి, శ్రీరాములు అనే వ్యక్తికి 2024 జులైలో గిఫ్ట్ రిజిస్ట్రేషన్ చేసినట్లు స్థానికుల వద్ద డాక్యుమెంట్ ఆధారాలు ఉన్నాయి.. వెంచర్ నిర్వాహకులు, ఒక్కో బ్లాక్‌లో ఎంత విస్తీర్ణంలో పార్కుస్థలాలు ఉన్నాయో 6 బ్లాకుల్లోని పార్కుస్థలాల వివరాలను బోర్డుపై స్పష్టంగా తెలియజేశారు.. సింహపురి కాలనీ మొత్తం అపార్ట్‌మెంట్‌లతో ఉన్నందున, కాసేపు ఆహ్లాదకరమైన వాతావరణంలో గడపడానికి కేటాయించిన ఈ పార్కుస్థలాలే కబ్జాకు గురైతే..! భవిష్యత్తులో పరిస్థితి ఏమిటని స్థానికులు ఆవేదన చెందుతున్నారు.. తాము పార్కు స్థలాలను చూసిన తర్వాతే అపార్ట్‌మెంట్‌లో ఫ్లాట్ కొనుగోలు చేశామని,ఇప్పుడు అవే పార్కుస్థలాలు విక్రయించడం ఏంటని కాలనీ ప్రజలు ప్రశ్నిస్తున్నారు..

## సింహపురి కాలనీ "హుడా లేఅవుట్" పార్కు స్థలాల వివరాలు..

బౌరంపేట్ సింహపురి కాలనీ "ఎ నుండి ఎఫ్" వరకు 6 బ్లాక్‌ల పార్కుస్థలాల వివరాలు (బోర్డుపై ఉన్నది ఉన్నట్లు) కాలనీలో మొత్తం 6 బ్లాకులకు గాను.. ఏ-బ్లాక్‌లో 2 పార్కులకు 2628 గజాలు కేటాయించగా.. బి-బ్లాక్‌లో '0' ఏమి లేనట్లు చూపించారు.. సి-బ్లాక్‌లో 1 పార్కు స్థలానికి 513 గజాలు.. డి-బ్లాక్‌లో 4 పార్కు స్థలాలకు గాను 5334 గజాలు కేటాయించారు.. ఇ-బ్లాక్‌లో 2 పార్కులకు 5040 గజాలు కేటాయించారు.. ఎఫ్-బ్లాక్‌లో 1 పార్కు స్థలానికి 2208 గజాల స్థలం కేటాయిస్తూ..! మొత్తం 10 పార్కుల జాబితాను బోర్డుపై ఉంచారు.. అయితే మరికొన్ని పార్కు స్థలాలు కూడా ఆక్రమణకు గురైనట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు.. వాటిపై కూడా దుండిగల్ మున్సిపల్ అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి చర్యలు చేపట్టాలని కోరుతున్నారు..

## "డి-బ్లాక్‌లోనూ" బోర్డు పెట్టిన ప్రజా ప్రయోజనాల స్థలాన్నే..!!

బౌరంపేట్ సింహపురి కాలనీ 6 బ్లాకులుగా వెంచర్ ఏర్పాటు చేశారు.. అయితే ప్రతి బ్లాకులో కేటాయించిన పార్కు స్థలాల్లో ఎన్ని పార్కులు, ఎన్ని గజాలు అన్న వివరాలను బోర్డుపై ఉంచారు.. "డి-బ్లాక్‌లో" 4 పార్కులకు గాను, 5334 గజాల స్థలం కేటాయించినట్లు స్పష్టంగా ఉంది.. డి-బ్లాక్‌లో ప్లాట్ నెంబర్ 135, 136 పక్కనే ఉన్న ప్రజా ప్రయోజనాల స్థలం సుమారు 450 గజాల స్థలంలో, బౌరంపేట్ గ్రామపంచాయతి హయాంలోనే పెట్టిని హెచ్చరిక బోర్డును పక్కన పడేసి చదును చేశారు..ఈ విషయాన్ని గతేడాది స్థానికులు పార్కుస్థలాల కబ్జాలతో పాటు ఓపెన్ ల్యాండ్‌ను మీడియా దృష్టికి తీసుకువచ్చారు.. సంబంధిత అదే స్థలాన్ని కూడా ఇతరులకు రిజిస్ట్రేషన్‌లు చేసినట్లు సమాచారం..

## డి.బ్లాక్‌లో పార్కును టెంపుల్ కాంప్లెక్స్‌గా రిజిస్ట్రేషన్..

బౌరంపేట్ సింహపురి కాలనీలోని డి-బ్లాక్‌లోనే మరోచోట ఉన్న అతిపెద్ద విస్తీర్ణంగల పార్కులో వినాయక మండపం నిర్మాణం చేపట్టారు.. "శ్రీ గణపతి పార్కుగా" బోర్డు ఏర్పాటు చేయగా..! అదే స్థలంలో పాత బోర్డును తొలగించి కొత్తగా "శ్రీ గణపతి టెంపుల్ కాంప్లెక్స్"గా నూతన బోర్డు ఏర్పాటు చేయడంపై డి-బ్లాక్ ప్రజలు వ్యతిరేకిస్తున్నారు.. సదరు పార్కును అభివృద్ధి చేయకుండా, టెంపుల్ కాంప్లెక్స్ పేరుతో కమర్షియల్ చేసేందుకు చూస్తున్నారని ఆరోపించారు.. తాము అపార్ట్‌మెంట్ కల్చర్‌లో ఉన్నందున కాసేపు సేదతీరేందుకు అనుకూలంగా ఉన్న ఈ పార్కు స్థలాన్నికూడా టెంపుల్ కాంప్లెక్స్‌గా మార్చేసి, కమర్షియల్ షెట్టర్‌లు నిర్మించే యోచనతో ఉన్నట్టు డి-బ్లాక్ ప్రజలు ఆరోపిస్తున్నారు..











డి-బ్లాక్‌లో గణపతి పార్కును- గణపతి టెంపుల్ కాంప్లెక్స్‌గా మార్పు..




సింహపురి కాలనీ హుడా లేఅవుట్ 1998..

# బాచుపల్లి తహశీల్దార్ నోటీసులకు..
# హైడ్రాకు సంబంధం లేదు..!

హైడ్రా కమిషనర్
ఏ.వి.రంగనాథ్
ఐపీఎస్..



## ఈటెల రాజేందర్ వ్యాఖ్యలపై.. హైడ్రా కమిషనర్ రంగనాథ్ ప్రకటన..

- ఎఫ్‌టిఎల్‌లో నిర్మాణాలకు బాచుపల్లి ఎమ్మార్వో నోటీసులు వివాదాస్పదం..
- బాచుపల్లి తహశీల్దార్ బాధితులకు అండగా ఉంటానని బీజేపీ ఎంపి భరోసా..
- ఆ క్రమంలోనే హైడ్రాపై ఈటల చేసిన వ్యాఖ్యలపై హైడ్రా కమిషనర్ వివరణ..
- నోటీసుల వ్యవహారం మేడ్చల్ జిల్లా కలెక్టర్‌కి కూడా తెలియదని కమిషనర్ తెలిపారు..
- కలెక్టర్‌కి కూడా తెలియకుండానే ఎమ్మార్వో నోటీసులిచ్చారని ఒకవైపు చెబుతూనే..
- నిబద్ధతో పని చేస్తున్న హైడ్రాను దోషిగా నిలబెట్టే ప్రయత్నాలు దురదృష్టకరం..



మల్కాజిగిరి బీజేపీ ఎంపి
ఈటెల రాజేందర్..

**మేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్, మే 11:** బాచుపల్లిలోని పూజిత ఎన్‌క్లేవ్‌లో రెండు అపార్ట్‌మెంట్‌ల నివాసితులకు, ఎఫ్‌టిఎల్‌లో కట్టడాలు ఉన్నాయని బాచుపల్లి తహసీల్దార్ నోటీసులు ఇవ్వడం తీవ్ర దుమారం లేపుతోంది.. బాచుపల్లి ఎమ్మార్వో బాధితులకు తను అండగా ఉంటానని మల్కాజిగిరి ఎంపి ఈటెల రాజేందర్ భరోసా ఇస్తూనే..! హైడ్రాపై ఎంపి చేసిన వ్యాఖ్యలకు హైడ్రా కమిషనర్ ఏ.వి.రంగనాథ్ తీవ్రంగా స్పందించారు.. ఆదివారం హైడ్రా నుండి అధికారిక ఎక్స్ అకౌంట్‌లో ఆయన ప్రకటన జారీ చేశారు.. తహశీల్దార్ నోటీసులకు హైడ్రాకు సంబంధం లేదని స్పష్టతను ఇచ్చారు.. ఈ విషయంపై కలెక్టర్‌కి ఫోన్‌లో మాట్లాడగా తనకు తెలియదని, కలెక్టర్ చెప్పాడని కమిషనర్ తెలిపారు.. మరోవైపు ఇదే విషయాన్ని పూజిత ఎన్‌క్లేవ్ అపార్ట్‌మెంట్ భాధితుల సమావేశంలో పాల్గొన్న ఎంపి ఈటెల రాజేందర్ కలెక్టర్‌కి కూడా తెలియదని చెబుతూనే..! నిబద్ధతో పని చేస్తున్న హైడ్రాను దోషిగా నిలబెట్టాలని చేస్తున్న ప్రయత్నాలు దురదృష్టకరం అంటూ కమిషనర్ రంగనాథ్ తెలిపారు.. అసలు నోటీసులు ఎందుకు ఇచ్చారో తహశీల్దార్‌ను అడగాలని కలెక్టర్‌ను కోరినట్లు హైడ్రా కమిషనర్ రంగనాథ్ పేర్కొన్నారు..

## హైడ్రా నిబద్ధతతో పనిచేస్తుంది: కమిషనర్ రంగనాథ్..

బడా భూ కబ్జాదారుల పట్ల హైడ్రా కఠినంగా వ్యవహరించినప్పటికీ..! సామాన్యులకు అండగా వుంటుందని ఈటెల రాజేందర్‌కు కమిషనర్ రంగనాథ్ సమాధానం ఇచ్చారు.. ఎంపి ఈటల రాజేందర్ మాటలు ప్రజలను తప్పుదోవ పట్టించే విధంగా ఉన్నాయని, అయోమయానికి గురిచేసేవిగానూ ఉన్నాయిని ఆయన ఎక్స్ ప్రకటనలో వివరించారు.. హైడ్రా పనితీరుపై ప్రజల్లో స్పష్టమైన అవగాహన ఉన్న ఈ తరుణంలో ఈటల రాజేందర్ లాంటి వారు హైడ్రాపై ఆరోపణలు చేస్తూ ప్రజలకు తప్పుడు సంకేతాలు ఇవ్వడం సబబు కాదని అన్నారు..
సచివాలయంలో ఈటల కలిసినప్పుడు కూడా హైడ్రా కార్యకలాపాలపై చర్చ సందర్భంలో స్పష్టంగా వివరించినట్లు పేర్కొన్నారు.. జూలై, 2024 కంటే ముందు కట్టిన నివాసాల జోలికి హైడ్రా వెళ్ళదని స్పష్టం చేసానని.. అనుమతులు తీసుకున్న వాణిజ్య సముదాయాలను కూడా హైడ్రా తొలగించదని..! సామాన్యులను హైడ్రా ఇబ్బంది పెట్టదని. హైడ్రా పని తీరుపైన ప్రజలు ఎంతో స్పష్టతతో ఉన్నారని అన్నారు... అనవసరమైన ఆరోపణలు చేసి ఎవరినీ ఇబ్బందులకు గురి చేయ వద్దని హైడ్రా కమిషనర్ కోరారు.

# యాదగిరిగుట్టలో ముగిసిన నరసింహ జయంతి ఉత్సవాలు

- మొదటి పేజి తరువాయి

పాత గుట్ట ఆలయాల్లో స్వస్తివాచనం, విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, రక్షాబంధనం, కుంకుమార్చన, మత్స్యగ్రహణం, అంకురార్పణ, హవనంతో జయంతి ఉత్సవాలను అర్చకులు ప్రారంభించారు. ప్రతిరోజు ఉదయం, సాయంత్రం వేళల్లో స్వామికి పలు రకాల అలంకార సేవలు అందించారు. గుట్ట అనుబంధ ఆలయమైన దబ్బగుంటపల్లిలోని యోగానంద నరసింహస్వామి టెంపుల్ లో కూడా ఏకకాలంలో ఉత్సవాలు నిర్వహించారు రెండో రోజు శనివారం ఉదయం స్వామికి నిత్య పూజల తర్వాత ప్రధానాలయంలో నిత్య మూలమంత్ర హవనాలు, లక్ష పుష్పార్చన చేశారు. అనంతరం స్వామిని కాళీయ మర్దన శ్రీకృష్ణ అలంకారంలో వజ్ర వైఢూర్యాలు, బంగారు నగలతో ముస్తాబు చేశారు. ప్రధానాలయ తిరువీధుల్లో ఊరేగుతూ భక్తులకు ద
కనువిందు చేశారు. సాయంత్రం స్వామికి నిత్య కైంకర్యాల తర్వాత.. నృసింహ మూల మంత్ర హవనం, హనుమద్వాహం నిర్వహించారు. అనంతరం హనుమంతుడి వాహనంపై ఆలయ వీధుల్లో విహరింపజేశారు.పాతగుట్ట క్షేత్రంలో కూడా ఘనంగా జరిగాయి. కొండపైన సాంస్కృతిక, సంగీత, భజన, కూచిపూడి ప్రదర్శనలు భక్తులను
ఆకట్టుకున్నాయి. యాదగిరీశుడి జయంతి ఉత్సవాల చివరి రోజైన ఆదివారం నృసింహ జయంతి, ఆవిర్భావ ఘట్టంతో ముగియనున్నాయి. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ నరసింహమూర్తి, డిప్యూటీ ఈవో దోర్బల భాస్కర్ శర్మ, ఏఈవోలు, సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.

# 600 ఎకరాలు, 200 రకాలు..కోట్లల్లో ఆదాయం, వేల మందికి ఉపాధి..

**హైదరాబాద్ పెన్ పవర్:**ఒకప్పుడు కాలుష్యంతో సమస్యలు ఎదుర్కొన్న రిలయన్స్ సంస్థ.. ఆ సమస్యనే ఒక అవకాశంగా మార్చుకుంది. వందల ఎకరాల్లో మామిడి చెట్లను పెంచి, వందల రకాల పండ్లను పండిస్తూ, ప్రకృతికి తమ వంతు చేయూతనందిస్తోంది. ఈ తోట కేవలం ఆదాయాన్ని మాత్రమే కాదు, పర్యావరణాన్ని కాపాడుతూ, చుట్టుపక్కల రైతులకు కొత్త దారులు చూపిస్తోంది. అత్యాధునిక వ్యవసాయ పద్ధతులను అవలంబిస్తూ, నాణ్యమైన మామిడి పండ్లను ప్రపంచానికి అందిస్తోంది. నీతా అంబానీనే స్వయంగా పర్యవేక్షిస్తుండడం విశేషం.

అంబానీ వారి మామిడి తోట ఆసియాలోనే అతి పెద్దదట. ఎకరాల కొద్దీ విస్తరించి, వందల రకాల మామిడి పండ్లను పండిస్తూ, కోట్లల్లో ఆదాయం తెచ్చిపెడుతోంది. ఇంతకీ ఈ ప్రత్యేకమైన తోట ఎక్కడ ఉంది? దీని వెనుక ఉన్న కథ ఏమిటి? రిలయన్స్ సంస్థ దీన్ని ఎందుకు ప్రారంభించింది? వివరంగా ఈ కథనంలో తెలుసుకుందాం.



గుజరాత్‌లోని జామ్‌నగర్‌లో రిలయన్స్ ఇండస్ట్రీస్ నిర్వహిస్తున్న 'ధీరూభాయ్ అంబానీ లఖీబాగ్ అమ్రాయి' మామిడి తోట ఆసియాలోనే అతి పెద్దదిగా గుర్తింపు పొందింది. సుమారు 600 ఎకరాల్లో విస్తరించి ఉన్న ఈ తోటలో లక్షా ముప్పై వేలకు పైగా మామిడి చెట్లు ఉన్నాయి. ఇక్కడ దాదాపు 200 రకాల మామిడి పండ్లను పండిస్తారు. ప్రతి సంవత్సరం ఈ తోట నుండి 600 టన్నుల మామిడి పండ్లు దిగుబడి వస్తాయి. రిలయన్స్ సంస్థ ఈ పండ్లన్నింటినీ ఆన్‌లైన్‌లోనూ, తమ స్టోర్ల ద్వారా దేశ విదేశాలకు ఎగుమతి చేస్తూ భారీగా ఆదాయం పొందుతోంది.

ఈ తోట ఏర్పాటు వెనుక ఒక ఆసక్తికరమైన కథ ఉంది. 1997లో జామ్‌నగర్‌లోని రిలయన్స్ చమురు శుద్ధి కర్మాగారం వల్ల కాలుష్యం పెరిగిపోయింది. కాలుష్య నియంత్రణ మండలి నిబంధనలకు అనుగుణంగా చర్యలు తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. అప్పుడు రిలయన్స్ యాజమాన్యం ఒక వినూత్నమైన ఆలోచన చేసింది. అదే ఈరోజు వారికి ప్రత్యేక గుర్తింపును తెచ్చిపెట్టింది. ఒకప్పుడు బీడు భూమిగా ఉన్న ప్రాంతాన్ని మామిడి తోటగా మార్చారు.ఇప్పుడు ఈ తోట ఏకంగా వంద కోట్ల రూపాయలకు పైగా టర్నోవర్‌ను అందుకుంటోంది. అంతేకాదు, చుట్టుపక్కల ప్రాంతాల వారికి కూడా ఉపాధి కల్పిస్తోంది.

ఈ తోటలో కేసర్, ఆల్ఫోన్సో, రత్న, సింధు, నీలమ్, ఆమ్రపాలి వంటి మన దేశీయ రకాలతో పాటు టామీ అట్కిన్స్, కెంట్, లిలీ, మాయా వంటి విదేశీ రకాలు కూడా ఉన్నాయి. లక్షల సంఖ్యలో చెట్లను పెంచుతూ, డీశాలినేషన్ (నీటిలోని లవణాలు తొలగించడం), డ్రిప్ ఇరిగేషన్ (బిందు సేద్యం), ఫెర్టిగేషన్ (ఎరువులను నీటి ద్వారా అందించడం), వాటర్ హార్వెస్టింగ్ (వాన నీటిని నిల్వ చేయడం) వంటి అత్యాధునిక వ్యవసాయ పద్ధతులను ఇక్కడ ఉపయోగిస్తారు. రసాయన ఎరువులు, క్రిమిసంహారక మందులు వాడకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం వల్లనే ఇక్కడ పండే ప్రతి పండు ఎంతో రుచిగా ఉంటుంది.ఈ తోట ఇప్పుడు రైతులకు, శాస్త్రవేత్తలకు పరిశోధనా కేంద్రంగా కూడా మారింది. రిలయన్స్ సంస్థ ప్రతి సంవత్సరం లక్షకు పైగా మామిడి మొక్కలను స్థానిక రైతులకు పంచిపెడుతూ, ఆధునిక వ్యవసాయ పద్ధతులపై శిక్షణ ఇస్తోంది. తద్వారా ఆ ప్రాంతంలో పచ్చదనాన్ని పెంచడానికి సహాయం చేస్తోంది. ఈ ప్రత్యేకమైన మామిడి తోటను నీతా అంబానీ స్వయంగా పర్యవేక్షిస్తుండటం విశేషం. వేసవిలో ఈ తోట ప్రపంచవ్యాప్తంగా పర్యాటకులను ఆకర్షిస్తోంది.

# కనిపించే దైవం అమ్మ..ఎందుకంటే.?




**హైదరాబాద్ పెన్ పవర్:**అమ్మ... దైవంతో సమానం. ఎందుకంటే.. పొత్తిళ్లలో బిడ్డను చూడగానే ప్రసవ వేదనను మర్చిపోతుంది. నవమాసాలు మోసి, కన్న బిడ్డల్ని కంటికి రెప్పలా చూసుకుంటుంది. బిడ్డల ఎదుగుదలనే తన ఎదుగుదల అనుకుంటుంది. పిల్లల మనసును అర్థం చేసుకుని అడగకుండానే అన్నీ ఇస్తుంది అమ్మ. ఎంత కష్టమొచ్చినా భూదేవిలా తనలో దాచుకుంటుందే తప్ప, ఎవరినీ నిందించదు. ప్రేమ, ఓర్పు, సహనం, ధైర్యం.. వీటన్నింటికి మారుపేరు అమ్మే. ఎప్పుడూ మంచే జరగాలని కోరుకునే అమ్మ మనసు అమృతం కన్నా గొప్పది. అలాంటి అమ్మలందరికీ ప్రేమతో.. మాతృదినోత్సవ శుభాకాంక్షలు. తల్లీబిడ్డలది పేగు బంధం. అందుకే పుట్టినప్పటి నుంచి బిడ్డ ఆకలి, నొప్పి, బాధ.. అన్నీ చెప్పకుండానే అమ్మకు తెలుస్తాయి. అప్పటిదాకా ఆమె అమ్మాయిగా ఆమెకి ఎన్నో ఆలోచనలు ఉన్నా, అమ్మ అయ్యాక తన ఆలోచనంతా బిడ్డల మీదే. పిల్లలు ఏదైనా సాధిస్తే, అది తన గెలుపు అన్నట్టే మురిసిపోతుంది. పిల్లలు ఎంత పెద్దవాళ్లైనా, ఇంటి నుంచి బయటికెళ్తే తిరిగి వచ్చేదాకా కళ్లార్పకుండా వాళ్లకోసం ఎదురు చూస్తుంది. పరీక్షల్లో తప్పామనే కోపంతో నాన్న తిడుతుంటే, ఈసారి మళ్లీ రాసి పాసవుతాడంటూ వెనకేసుకొస్తుంది. చిన్నప్పుడు లాలిస్తూ, బుజ్జగిస్తూ, కథలు చెప్పే అమ్మ.. పెద్దయ్యాక ఫ్రెండ్?లా, మెంటార్?లా పక్కనే ఉండి సపోర్ట్ చేస్తుంటుంది. అమ్మకి తెలుసు.. మనం అనుకున్నది సాధించలేకపోతే, ఎంత బాధ పడతామో అని.

ఆడుకునేటప్పుడో, పనిచేసేటప్పుడో ఏదైనా గాయం అయితే మనకు తెలియకుండానే మన నోటి నుంచి 'అమ్మా' అనే అరుపు వస్తుంది. ఎందుకో తెలుసా... గాయాన్ని మాన్పేది మందైనా, నొప్పి బాధను తీర్చేది మాత్రం అమ్మే. ఎప్పుడైనా జలుబో, జ్వరమో వచ్చిందంటే.. అది తగ్గేదాకా పగలూరాత్రి సపర్యలు చేస్తుంది. తన ఆరోగ్యం గురించి ధ్యాస ఉండదు ఆమెకు. బిడ్డ ఆరోగ్యం బాగయ్యే వరకు ఆమె మనసు కుదుటపడదు. అంతెందుకు, అమ్మ ప్రేమ గురించి చెప్పాలంటే.. చూడ్డానికి అంత బాగోలేకపోయినా అమ్మ కంటికి మనం చాలా అందంగా కనిపిస్తాం. ఎందుకంటే ఆమెది అందమైన మనసు కాబట్టి.

పిల్లలు బాగా చదివి, ఉద్యోగాల్లో స్థిరపడి, దేశాలు దాటి వేల మైళ్ల దూరంలో వెళ్లినా... అమ్మకి కోపం రాదు. దానికి బదులు వాళ్ల మీద కొండంత ప్రేమ దాచుకుంటుంది. అమ్మ మనసంతా బిడ్డలపైనే ఉంటుంది. ఆడపిల్లను అత్తవారింటికి పంపేటప్పుడు,

గుండెల్లో బాధను దిగమింగుకుని ఏ కష్టమొచ్చినా 'నేనున్నా' అంటూ భరోసా ఇస్తుంది. పండుగ పబ్బాలకు అందరికీ కొత్త బట్టలు తీసే అమ్మ, తను మాత్రం ఆ పాత చీరలోనే ఉంటుంది. అందరికీ రుచిగా వండి పెట్టి, కడుపు నింపినప్పుడే తనకు పండుగ అనుకుంటుంది. ఇలా చెప్పుకుంటూ పోతే అమ్మ గొప్పతనం హిమాలయాల కంటే ఎత్తైనది. అమ్మ రుణాన్ని తీర్చుకోవడం ఈ సృష్టిలో ఏ బిడ్డకూ సాధ్యం కాదు. అందుకే అవకాశం వచ్చినప్పుడల్లా అమ్మను సంతోష పెట్టడం నేర్చుకోవాలి. వయసు మళ్లిన తల్లిని ఈసడించుకోక చేరదీయండి. అప్పుడు కూడా ఆమె పిల్లలకు భారం కాకూడదనే అనుకుంటుందని తెలుసుకోండి. అలాంటి అమ్మను బతికినన్నాళ్లు బాధ పెట్టకుండా చూసుకోండి. ఆమె ప్రేమకు ప్రతిగా తిరిగి ప్రేమను ఇవ్వండి. అమ్మ త్యాగానికి మనసారా చేతులెత్తి నమస్కరించండి. అదే ఆమెకి బిడ్డలుగా మనమిచ్చే గౌరవం. మాతృదినోత్సవ సందర్భంగా ఈరోజు అమ్మను సంతోషపెట్టేలా కానుక ఏదైనా ఇవ్వండి.

**చరిత్రలో...**

మరోవైపు, ఏటా మే రెండో ఆదివారం ప్రపంచ మాతృదినోత్సవాన్ని జరుపుకుంటున్నారు. దీనికి పెద్ద చరిత్ర ఉంది. గ్రీస్‌లో 'రియా' అనే దేవతను 'మదర్ ఆఫ్ గాడ్స్'గా భావించి ఏడాదికోసారి నివాళి అర్పించేవారు.

17వ శతాబ్దంలో ఇంగ్లాండ్‌లో తల్లులకు గౌరవంగా 'మదరింగ్ సండే' పేరిట ఉత్సవం చేసేవాళ్లు. 'జూలియవర్డ్ హొవే' అనే మహిళ అమెరికాలో1872లో మొదటిసారిగా ప్రపంచ శాంతి కోసం 'మదర్స్? డే' నిర్వహించాలని కోరింది. వెస్ట్ వర్జీనియాలో అన్నా జర్విస్ అనే మహిళ తల్లి.. అన్నా రీవ్స్ జర్విస్1905లో చనిపోయింది. ఆ సంవత్సరం నుంచే మదర్స్ డేని గుర్తింపు పొందిన సెలవుదినంగా జరుపుకోవాలని కోరింది. ఆ తర్వాత రెండు సంవత్సరాలకు 1907వ సంవత్సరంలో అమెరికాలో మాతృదినోత్సవం సెలబ్రేట్ చేసుకోవడం ప్రారంభమైంది. అలా1914లో మనదేశంలో మొదటిసారి మాతృదినోత్సవాన్ని జరుపుకున్నారు.

# రోదసి నుంచి డేగ కన్ను... భారత నిఘా సామర్థ్యానికి కొత్త బలం: మే 18న ఇస్రో 'రిశాట్-1బి' ప్రయోగం

- మే 18న శ్రీహరికోట నుంచి ఇస్రో రిశాట్-1బి ప్రయోగం
- సి-బ్యాండ్ రాడార్‌తో అన్ని వాతావరణాల్లోనూ స్పష్టమైన చిత్రాలు
- సరిహద్దు నిఘా, జాతీయ భద్రతకు అత్యంత కీలకం
- రక్షణ, పౌర ప్రయోజనాలకు ఉపయుక్తంబీ ఐదు ఇమేజింగ్ మోడ్‌లు
- ఇతర ఉపగ్రహాలతో కలిసి సమగ్ర భూ పరిశీలన వ్యవస్థ ఏర్పాటు




**హైదరాబాద్ పెన్ పవర్:**భారతదేశ సరిహద్దు నిఘా సామర్థ్యాలు, జాతీయ భద్రత మరింత పటిష్టం కానున్నాయి. ఇందుకుగాను భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) మే 18న శ్రీహరికోట అంతరిక్ష కేంద్రం నుంచి 'రిశాట్-1బి' (EOS-09) అనే అత్యాధునిక రాడార్ ఇమేజింగ్ ఉపగ్రహాన్ని ప్రయోగించనుంది. ఈ ఉపగ్రహం ద్వారా ఎలాంటి వాతావరణ పరిస్థితుల్లోనైనా, రాత్రింబగళ్లు భూమి ఉపరితలాన్ని స్పష్టంగా చిత్రీకరించడం సాధ్యమవుతుంది, ఇది దేశ రక్షణ రంగానికి కీలక ముందడుగుగా భావిస్తున్నారు.రిశాట్-1బి ఉపగ్రహంలో అత్యాధునిక సి-బ్యాండ్ సింథటిక్ అపెర్చర్ రాడార్ (SAR) వ్యవస్థను అమర్చారు. దీని ప్రత్యేకత ఏమిటంటే, వర్షం, దట్టమైన పొగమంచు, మేఘాలు అడ్డుగా ఉన్నా లేదా చిమ్మచీకటిలోనైనా భూమి ఉపరితలాన్ని హై-రిజల్యూషన్ చిత్రాలను తీయగలదు. సాధారణంగా ఆప్టికల్ కెమెరా ఆధారిత ఉపగ్రహాలు ప్రతికూల వాతావరణంలో లేదా రాత్రి సమయాల్లో చిత్రాలను స్పష్టంగా నమోదు చేయడంలో ఇబ్బందులు ఎదుర్కొంటాయి. కానీ, రిశాట్-1బి ఈ పరిమితులను అధిగమించి నిరంతరాయ నిఘాకు వీలు కల్పిస్తుంది. ఇటీవలే జరిగిన 'ఆపరేషన్ సిందూర్' తర్వాత కొద్ది రోజులకే ఈ ప్రయోగం జరుగుతుండటం ప్రాధాన్యతను సంతరించుకుంది.

నిపుణుల అభిప్రాయం ప్రకారం, పాకిస్థాన్, చైనా వంటి దేశాలతో ఉన్న సున్నితమైన సరిహద్దు ప్రాంతాలను పర్యవేక్షించడంలోనూ, దేశ విశాలమైన తీరప్రాంతాన్ని కాపాడటంలోనూ ఇది రక్షణ దళాలకు అమూల్యమైన సహకారం అందించనుంది. ముఖ్యంగా రక్షణ ప్రయోజనాలకు రిశాట్-1బి రాడార్ సాంకేతికత చాలా కీలకం. శత్రువుల కదలికలను పసిగట్టడం, చొరబాట్లను గుర్తించడం, ఉగ్రవాద వ్యతిరేక కార్యకలాపాలకు మద్దతు ఇవ్వడం వంటి వాటికి నిరంతరాయంగా, విశ్వసనీయమైన నిఘా సమాచారాన్ని అందించగలదని వారు తెలిపారు.

సైనిక పరికరాల తరలింపు వల్ల భూమిపై మట్టిలో కలిగే స్వల్ప కదలికలు, కొత్తగా వెలిసిన శిబిరాలు లేదా వాహనాల రాకపోకలు వంటి అతి చిన్న మార్పులను కూడా ఈ హై-రిజల్యూషన్ రాడార్ చిత్రాలు పసిగట్టగలవు. సాంప్రదాయ నిఘా వ్యవస్థలు కొన్నిసార్లు వీటిని గుర్తించలేకపోవచ్చు. గతంలో బాలాకోట్ దాడుల వంటి కీలక ఆపరేషన్లలో ఉపయోగించిన రిశాట్ సిరీస్ ఉపగ్రహాలకు ఇది మరింత అధునాతనమైన వెర్షన్ (కొనసాగింపు) అని ఇస్రో

వర్గాలు పేర్కొన్నాయి. ఉగ్రవాదులు సరిహద్దు దాటి దేశంలోకి చొరబడేందుకు ప్రయత్నించే అనుమానాస్పద కదలికలను రిశాట్-1బి మరింత కచ్చితత్వంతో గుర్తించి, ఉగ్రవాద వ్యతిరేక ఆపరేషన్లలో కీలక పాత్ర పోషించగలదని భావిస్తున్నారు. ఈ ఉపగ్రహంలో ఐదు విభిన్న ఇమేజింగ్ మోడ్‌లు ఉన్నాయి. అత్యంత చిన్న వస్తువులను కూడా గుర్తించగల అల్ట్రా-హై-రిజల్యూషన్ ఇమేజింగ్ నుంచి, విశాలమైన ప్రాంతాలను పర్యవేక్షించడానికి ఉపయోగపడే బ్రాడర్ స్కాన్స్ వరకు దీని పరిధి విస్తరించి ఉంటుంది. ఈ వైవిధ్యం వల్ల సైనిక అవసరాలతో పాటు వ్యవసాయం, అటవీ సంపద పర్యవేక్షణ, నేలలో తేమ శాతం అంచనా, భూగర్భ శాస్త్ర అధ్యయనాలు, వరదల సమయంలో సహాయక చర్యలు వంటి పౌర ప్రయోజనాలకు కూడా ఈ ఉపగ్రహాన్ని సమర్థవంతంగా ఉపయోగించుకోవచ్చు. రిశాట్-1బి ఉపగ్రహం, గతంలో ప్రయోగించిన రిశాట్-1 ఉపగ్రహానికి కొనసాగింపుగా, దాదాపు అదే తరహా కాన్ఫిగరేషన్‌తో రూపుదిద్దుకుంది. ఇది ఇప్పటికే సేవలందిస్తున్న రిసోర్స్‌శాట్, కార్టోశాట్, రిశాట్-2బి సిరీస్ వంటి ఇతర భూ పరిశీలన ఉపగ్రహాల నుంచి వచ్చే డేటాను పూర్తిచేస్తూ, ఒక సమగ్రమైన భూ పరిశీలన నెట్‌వర్క్‌ను నిర్మించడంలో కీలక భూమిక పోషిస్తుందని శాస్త్రవేత్తలు వివరించారు. ఇది భారతదేశపు 'ఆకాశంలో కన్ను'గా నిఘా సామర్థ్యాన్ని గణనీయంగా పెంచనుంది.

# తమ ల్యాప్‌టాప్‌లకు నిప్పు పెడుతున్న విద్యార్థులు.. వైరల్ అవుతున్న వింత ట్రెండ్!



**హైదరాబాద్ పెన్ పవర్:**ప్రస్తుత ఇంటర్నెట్ ప్రపంచంలో నిత్యం ఏదో ఒక వింత ఛాలెంజ్ ప్రజల్లో చర్చనీయాంశంగా మారుతూ ఉంటుంది. చాలా మంది వాటిని స్వీకరించి, అద్భుతంగా ప్రదర్శిస్తారు. వారి వీడియోలు కూడా ఇంటర్నెట్‌లో విపరీతంగా షేర్ అవుతుంటాయి. ఇదంతా లైక్‌లు, వ్యూస్ కోసం కంటిన్యూగా జరిగే తతంగమే. ప్రస్తుతం ఒక వింత, ప్రమాదకరమైన ఛాలెంజ్ వైరల్ అవుతోంది. దీనిలో ప్రజలు తమ సొంత ల్యాప్‌టాప్‌లకు నిప్పు పెడుతున్నారు. ఇంతకీ ఈ వింత ట్రెండ్ ఏమిటి? ప్రజలు ఎందుకిలా చేస్తున్నారు? వివరంగా తెలుసుకుందాం.ఈ కొత్త ఛాలెంజ్‌ను చక్రోమ్‌బుక్‌ఛాలెంజ్ అంటున్నారు. ఇందులో పిల్లలు ఒక ప్రత్యేకమైన స్టంట్ చేస్తున్నారు. వారు తమ ల్యాప్‌టాప్ ఛార్జింగ్ పోర్ట్‌లో కాగితం, పెన్సిల్ లెడ్ లేదా ఫాయిల్ పేపర్‌ను పెడుతున్నారు. దీనివల్ల ల్యాప్‌టాప్, ముఖ్యంగా దాని ఛార్జర్‌లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ అవుతోంది. దీనికి సంబంధించిన అనేక వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఈ సంఘటన కారణంగా ల్యాప్‌టాప్ లేదా ఛార్జర్‌లో మంటలు చెలరేగుతున్నాయి. దాని నుండి విషపూరితమైన పొగ వస్తోంది.

### ఈ ట్రెండ్ ఎందుకు ప్రమాదకరం?

మీడియా నివేదికల ప్రకారం.. అమెరికాలోని కనెక్టికట్‌లోని న్యూయింగ్‌టన్ హైస్కూల్‌లో ఇలాంటి ఛాలెంజ్ కారణంగా ఒక తరగతి గది మొత్తం పొగతో నిండిపోయింది. న్యూయార్క్ పోస్ట్ ప్రకారం, నగరంలోని ఫైర్ మార్షల్ డిజె జోర్డాన్ మాట్లాడుతూ, ఈ ట్రెండ్ కారణంగా ప్రజలు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ల్యాప్‌టాప్ బ్యాటరీ వెంటనే మంటలను అంటుకునే స్వభావం కలిగి ఉంటుంది. ఒకసారి అవి కాలిపోతే విషపూరితమైన పొగ బయటకు వస్తుంది. అనేక సందర్భాల్లో ఫైర్ ఇంజన్ ను పిలవాల్సి వస్తోంది.ఈ ఛాలెంజ్‌కు సంబంధించిన అనేక కేసులు అమెరికాలోని కాలిఫోర్నియా, కరోలినా, పెన్సిల్వేనియా, న్యూజెర్సీ, రోడ్ ఐలాండ్, విస్కాన్సిన్, వాషింగ్టన్ వంటి ప్రాంతాల్లో కనిపించాయి. టిక్‌టాక్ ప్రకారం.. గతేడాది అక్టోబర్ నుంచి డిసెంబర్ మధ్య 99.7 శాతం ప్రమాదకరమైన కంటెంట్‌ను తొలగించారు. అయితే, ఇప్పటికీ ప్రజలు ఇలాంటి కంటెంట్‌ను సోషల్ మీడియాలో వైరల్ చేయకూడదని ఫిర్యాదు చేస్తున్నారు

# అన్నాదమ్ముల పంచాయితీ.. 'ఈడీ'కి చేరి ముదిరి పాకానపడింది



**హైదరాబాద్ పెన్ పవర్:**విజయవాడ రాజకీయాల్లో కేశినేని సోదరుల మధ్య వైరం రోజురోజుకీ ముదురుతోంది. తాజాగా విజయవాడ ఎంపీ కేశినేని చిన్నిపై ఆయన అన్న, మాజీ ఎంపీ కేశినేని నాని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ)కి ఫిర్యాదు చేయడం తీవ్ర చర్చనీయాంశమైంది. ఆంధ్రప్రదేశ్ మద్యం కుంభకోణం, మనీ లాండరింగ్ వ్యవహారాల్లో చిన్ని ప్రమేయం ఉందని ఆరోపిస్తూ నాని ఈడీకి ఫిర్యాదు చేశారు. చిన్ని అవినీతిపరుడని మొదటి నుంచి ఆరోపిస్తున్న నాని, ఇటీవల మద్యం కుంభకోణంలో ప్రధాన నిందితుడు రాజ్ కసిరెడ్డితో చిన్నికి వ్యాపార సంబంధాలున్నాయని, వీరిద్దరూ కలిసి ఆర్థిక లావాదేవీలు నడిపారని ఆరోపించారు. దీనికి సంబంధించి ఆధారాలు తన వద్ద ఉన్నాయని కూడా నాని పేర్కొన్నారు. ఇప్పటికే ఈ విషయమై సీఎం చంద్రబాబుకు ఫిర్యాదు చేసిన నాని, తాజాగా ఈడీకి ఫిర్యాదు చేసి చిన్నిపై విచారణ కోరారు. ఈడీకి చేసిన ఫిర్యాదును ఆయన సోషల్ మీడియాలో పంచుకున్నారు.

### ఈడీకి నాని ఫిర్యాదులో కీలక అంశాలు:

ఆంధ్రప్రదేశ్ మద్యం కుంభకోణంలో పెద్ద ఎత్తున మనీ లాండరింగ్ జరిగిందని, దీనిపై ఎఫ్ఐఆర్ నం. 21/2024 కింద జరుగుతున్న విచారణకు సంబంధించి కీలక వాస్తవాలను ఈడీ దృష్టికి తీసుకెళ్తున్నానని నాని పేర్కొన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు ఏర్పాటు చేసిన స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్ (సిట్)పై తనకు నమ్మకం లేదని కేశినేని చిన్ని సీబీఐ విచారణకు అభ్యర్థించడం ఆందోళనకరమని నాని తెలిపారు. అధికారిక రికార్డులు, పబ్లిక్ డొమైన్ సమాచారం ప్రకారం, కేశినేని శివనాథ్ (చిన్ని), అతని భార్య జానకి లక్ష్మి, రాజ్ కసిరెడ్డి ప్రైడ్ ఇన్‌ఫ్రాకామ్ %బ్రూ%తో పాటు ఇతర వ్యాపార సంస్థలలో భాగస్వాములుగా ఉన్నారని, ప్రివెన్షన్ ఆఫ్ మనీ లాండరింగ్ యాక్ట్ 2002ను ఉల్లంఘించి ఈ సంస్థలను ఆదాయ లావాదేవీలకు ఉపయోగించి ఉండవచ్చని ఫిర్యాదులో పేర్కొన్నారు. చిన్ని కుటుంబ సభ్యులు, సన్నిహితులు, వ్యాపార భాగస్వాములతో సహా దేశంలోనే కాకుండా విదేశాల్లోనూ వివిధ కంపెనీల ద్వారా మనీ లాండరింగ్ జరిపి వుంటారని నమ్మడానికి బలమైన ఆధారాలున్నాయని నాని ఈడీకి తెలిపారు.

ఈ వ్యవహారంలో కేశినేని చిన్ని భార్య జానకి లక్ష్మి, కుమారుడు వెంకటచౌదరి, మధు బాబు కందిమళ్ల, సురేష్ పీటీ, రామ్ వెనిగళ్ల, చక్రవర్తి కడియాల, వంశీ కడియాల, కుమార్ అడుసుమల్లి, రాజేష్ పోసం, మోహన్‌రావు బొల్లినేని, వెంకటకృష్ణ కిషోర్ తాళ్లూరి, నాగేశ్వరరావు గాలిపై విచారణ జరపాలని ఆయన ఈడీని అభ్యర్థించారు. రూ. 2,000 కోట్ల చైన్-లింక్ స్కామ్‌పై హైదరాబాద్ సెంట్రల్ క్రైమ్ స్టేషన్‌లో కేసు నమోదైందని, ప్రస్తుతం ఆ కేసు విచారణలో ఉందని నాని ఈడీ దృష్టికి తీసుకెళ్లారు. లోతైన, నిష్పాక్షిక దర్యాప్తు జరిపి నిజానిజాలను వెలికి తీయాలని నాని తన ఫిర్యాదులో ఈడీని కోరారు. ఈ ఫిర్యాదుపై ఈడీ ఎలా స్పందిస్తుందో వేచి చూడాలి.ఇప్పటికే ఆంధ్రప్రదేశ్ మద్యం కుంభకోణంపై ఈడీ మనీ లాండరింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించిన నేపథ్యంలో, నాని ఫిర్యాదు ఈ కేసు విచారణలో కీలక పరిణామం కానుంది. మరోవైపు, నాని ఆరోపణలపై కేశినేని చిన్ని స్పందిస్తూ, మద్యం కుంభకోణాన్ని పక్కదారి పట్టించేందుకే తనపై నిరాధార ఆరోపణలు చేస్తున్నారని, నాని ఆరోపణలపై సీబీఐ విచారణకు తాను సిద్ధమని సవాల్ విసిరారు. ఈ పరిణామాలు విజయవాడ రాజకీయాల్లో మరింత వేడిని రాజేశాయి.

# 'పుల్వామా దాడి మా వ్యూహాత్మక ప్రతిభ'... అంగీకరించిన పాక్!

**హైదరాబాద్ పెన్ పవర్:** ఏప్రిల్ 22న పహల్గాంలో అమాయకులపై పర్యాటకులపై జరిగిన ఉగ్రదాడిలో 26 మంది మరణించిన సంగతి తెలిసిందే. అందులో 24 మంది భారతీయ మహిళలు నుదుటన తమ సిందూరాన్ని దూరం చేసుకున్నారు. దీంతో ఆపరేషన్ సిందూర్ స్టార్ట్ చేసింది భారత్! దీంతో... పాకిస్థాన్, పాక్ ఆక్రమిత కాశ్మీర్ లోని ఉగ్రమూకలపై విరుచుకుపడింది.

దీనిపై స్పందించిన పాక్... అసలు ఉగ్రవాదులకు తమకూ ఎలాంటి సంబంధం లేదని.. తాము కూడా ఉగ్రవాద బాధితులమే అని బుకాయించడం మొదలుపెట్టింది. మరోపక్క ఆపరేషన్ సిందూర్ దాడిలో మరణించిన ఉగ్రవాదుల అంత్యక్రియలను ప్రభుత్వ లాంఛనాలతో జరిపించింది. ఈ సందర్భంగా ఉగ్రవాదుల శవపేటికలపై పాకిస్థాన్ జాతీయ జెండా కప్పింది! దానికి సంబంధించిన ఫోటోలు, వీడియోలు నెట్టింట వైరల్ గా మారాయి. దీంతో... పాకిస్థాన్ కు ఉగ్రవాదులకు ఉన్న సంబంధానికి ఇది తాజా ఉదాహరణ అని మెజారిటీ ప్రపంచం మొత్తం అంగీకరించింది! ఆ ఫోటోలు ట్రంప్ & కో కూడా చూసి ఉండోచ్చు.. ఆ వీడియోలు మోడీ & కో కూడా వీక్షించి ఉండోచ్చు! అయినప్పటికీ కాల్పుల విరమణకు అంగీకరించారు!! దీంతో... పాకిస్థాన్ లో ప్రజానికం భారత్ పై గెలిచామని సంబరాలు చేసుకుంటున్నారు. వీధుల్లోకి రాకెట్ లాంఛర్ లు, ఏకే-47 తుపాకులు తెచ్చి ర్యాలీలు చేస్తూ సంబరాలు చేసుకుంటున్నారు.



దీనికి సంబంధించిన వీడియోలు చూసిన భారతీయులకు పుండు మీద కారం చల్లినట్లుందని అంటున్నారు. సరిగ్గా ఈ సమయంలో... పుల్వామా దాడి మా పనే అని అంగీకరించింది పాకిస్థాన్! అవును... 2019 ఫిబ్రవరి 14న జమ్మూ, శ్రీనగర్ జాతీయ రహదారిలో భారతీయ పారామిలటరీ సిబ్బంది ప్రయాణిస్తున్న వాహనాల కాన్వాయ్ పైకి ఇంప్రొవైస్డ్ ఎక్స్ ప్లోజివ్ డివైజ్ (ఐఈడీ) లతో నిండి ఉన్న కారు వచ్చి ఢీకొట్టింది. ఆ ఆత్మాహుతి బాంబు దాడిలో 40 మంది సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ సైనికులు మరణించారు. ఆ సమయంలో.. రోడ్డుపై భారత పారామిలటరీ సిబ్బంది శరీరాలు మాంసపు ముద్దలుగా చల్లా చెదురుగా పడి ఉన్నాయి! ఆ సమయంలో డీ.ఎన్.ఏ పరీక్షలు చేసి, ఆ పరీక్షలతో సెట్ అయిన మాంసపు ముద్దలను వారి వారి కుటుంబ సభ్యులకు పేటికలో పెట్టి చూపించిన పరిస్థితి! అది ఎప్పటికీ భరతమాత గుండెల్లో తరగని ఆవేదన!

అయితే.. కశ్మీర్ లోని పుల్వామాలో 40 మంది పారామిలటరీ సిబ్బంది మరణానికి కారణమైన బాంబుదాడి వెనుక తమ హస్తం ఉందని పాక్ అంగీకరించింది. ఈ విషయాన్ని తాజాగా ఆ దేశ వాయుసేన ఎయిర్ వైస్ మార్షల్ ఔరంగజేబ్ అహ్మద్ మీడియా సమావేశంలో అంగీకరించారు. పైగా దాన్ని తమ వ్యూహాత్మక ప్రతిభగా అభివర్ణించారు.

ఆపరేషన్ సిందూర్ సందర్భంగా ఇటీవల జరిగిన ప్రెస్ మీట్ లో మాట్లాడిన అహ్మద్... పాకిస్థాన్ కు చెందిన భూభాగం, గగనతలం, జల సరిహద్దులకు, ప్రజలకు ముప్పుగా పరిణమిస్తే వాటిని ఎదుర్కొనేందుకు తాము రాజీ పడబోమని.. మా దేశానికి మేము కట్టుబడి ఉంటామని అన్నారు. ఈ నేపథ్యంలోనే పుల్వామా టాపిక్ తెచ్చారు. ఇందులో భాగంగా... పుల్వామాలో మా అద్భుతమైన ఎత్తుగడలను చూపించామని.. మా కార్యదక్షత, వ్యూహాత్మక ప్రతిభను ఇప్పటికే ప్రదర్శించామని.. మా దేశ ప్రజల కీర్తి మొత్తం దళాల్లోనే ఇమిడి ఉండటంతో తాము ఎప్పుడూ దాన్ని నిలబెట్టుకుంటామని వ్యాఖ్యానించారు. దీంతో... ఉగ్రవాదంతో తమకు సంబంధం లేదని పాకిస్థాన్ పెద్దలు చెబుతున్న కబుర్లు, నొక్కుతున్న సన్నాయిలు మొత్తం అసత్యాలని మరోసారి రుజువైందని తెలుస్తోంది. మరోవైపు... నాడు పుల్వామా ఘటనతో తమకు ఎలాంటి సంబంధం లేదని నాడు బుకాయించిన పాక్.. ఇప్పుడు అంగీకరించింది! ఈ నేప థ్యంలో... మరోసారి కాల్పుల విరమణ టాపిక్ వచ్చి నప్పుడు.. 2025లో పహల్గాం ఘటన కూడా తమ ప్రతి భే అనిఒప్పుకునే అవకాశం ఉందని అంటున్నారు నెటిజన్లు!

# సరిహద్దు రాష్ట్రాల నుంచి ఢిల్లీలోని తెలంగాణ భవన్ కు చేరుకుంటున్న తెలంగాణ వాసులు




**హైదరాబాద్ పెన్ పవర్:** సరిహద్దు రాష్ట్రాల్లో నెలకొన్న ప్రత్యేక పరిస్థితుల నేపథ్యంలో, తెలంగాణకు చెందిన విద్యార్థులు, ఇతర పౌరులు పెద్ద సంఖ్యలో ఢిల్లీలోని తెలంగాణ భవన్‌కు తరలివస్తున్నారు.

వారికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా అండగా నిలుస్తూ, అవసరమైన సౌకర్యాలు కల్పిస్తోంది. ఆదివారం నాటికి దాదాపు 86 మంది తెలంగాణ వాసులు ఢిల్లీలోని తెలంగాణ భవన్‌కు చేరుకున్నారని అధికారులు వెల్లడించారు. వీరిలో ఇప్పటికే 26 మందిని వారి వారి స్వస్థలాలకు సురక్షితంగా పంపించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. మిగిలిన వారికి కూడా అవసరమైన వసతి, భోజన సదుపాయాలు కల్పిస్తున్నారు. తెలంగాణ రెసిడెంట్ కమిషనర్ గౌరవ్ ఉప్పల్ ఈ సహాయక చర్యలను స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. మరో 100 మంది వరకు తెలంగాణ వాసులు భవన్‌కు చేరుకునే అవకాశం ఉందని, వారికి కూడా అన్ని రకాల ఏర్పాట్లు చేస్తున్నామని ఆయన తెలిపారు. వసతి, భోజనం, వైద్య సేవలు, వారి స్వస్థలాలకు రవాణా వంటి అంశాలపై ఆయన ఇతర అధికారులతో సమీక్ష నిర్వహించి, తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తెలంగాణ భవన్‌కు చేరుకుంటున్న వారికి, స్వరాష్ట్రానికి తిరిగి వెళ్లాలనుకునేవారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని ఆయన స్పష్టం చేశారు. ఇంతకుముందే, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు, ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు ప్రభుత్వం ప్రకటించింది. తెలంగాణకు చెందిన పౌరులకు సంపూర్ణ సహాయం అందించడమే ఈ కంట్రోల్ రూమ్ లక్ష్యమని పేర్కొంది. ఇక్కడకు వచ్చే వారికి ఉచిత భోజనం, వసతితో పాటు వైద్య శిబిరం కూడా ఏర్పాటు చేసి, వారి ప్రయాణాలకు అవసరమైన తోడ్పాటు అందిస్తున్నామని ముఖ్యమంత్రి తెలిపారు.

జమ్మూ, పంజాబ్ సహా పలు ఉత్తరాది రాష్ట్రాల్లోని విశ్వవిద్యాలయాల్లో చదువుతున్న అనేక మంది విద్యార్థులు ఇప్పటికే తెలంగాణ భవన్‌కు చేరుకున్నారు. వారికి అన్ని విధాలా సహాయం అందించి, హైదరాబాద్‌కు సురక్షితంగా ప్రయాణించేందుకు ఏర్పాట్లు చేసినట్లు సమాచారం. సరిహద్దు రాష్ట్రాల్లో నివసిస్తున్న తెలంగాణ వాసులకు సకాలంలో సహాయం, సమాచారం, మద్దతు అందించేందుకే ఈ కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసినట్లు అధికారులు వివరించారు. అవసరమైన వారు తక్షణ సహాయం కోసం కింద సూచించిన నంబర్లలో సంప్రదించాలని రెసిడెంట్ కమిషనర్ కోరారు.

# పహల్గాం బాధితులకు న్యాయంపై రాజ్ నాథ్ సింగ్ క్లారిటీ!



**హైదరాబాద్ పెన్ పవర్:** భారత్ - పాక్ మధ్య కాల్పుల విరమణ జరిగిన సంగతి తెలిసిందే. దీనిపై ఇప్పటికే ప్రభుత్వం క్లారిటీ ఇచ్చేసింది. ఈ కాల్పుల విరమణ తమ విజయమని బీజేపీ ప్రకటించుకుంది! మరోపక్క ఈ కాల్పుల విరమణ తమ చారిత్రక విజయమని పాక్ ప్రధాని చెప్పుకొచ్చారు. ఈ సమయంలో రక్షణ మంత్రి రాజ్ నాథ్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఆపరేషన్ సిందూర్ సాధించిందేమిటో వెల్లడించారు. అవును... తాజాగా ఉత్తరప్రదేశ్ లోని బ్రహ్మోస్ ఉత్పత్తి కేంద్రాన్ని వర్చువల్ గా ప్రారంభించిన రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్.. ఈ సందర్భంగా ఆపరేషన్ సిందూర్ పై స్పందించారు. ఇందులో భాగంగా.. ఈ ఆపరేషన్ ద్వారా అనేక మంది మహిళల నుదిటి నుంచి సిందూరాన్ని తుడిచిన భారత వ్యతిరేక, ఉగ్రవాద సంస్థలపై సైన్యం ప్రతీకారం తీర్చుకుందని అన్నారు. ఇదే సమయంలో... సైన్యం చర్యలు సారిహద్దు ప్రాంతాలకే పరిమితం కాలేదని.. రావల్పిండిలోని పాకిస్థాన్ ఆర్మీ ప్రధాన కార్యాలయంలో కూడా బిగ్గరగా ప్రతిధ్వనించాయని అన్నారు. ఇక ఆపరేషన్ సిందూర్ లో భారత సైన్యం పాకిస్థాన్ ప్రజలకు,, సైనిక స్థావరాలకు సైతం ఇబ్బంది కలగకుండా జాగ్రత్తగా, సంయమనం పాటిస్తూ, ఖచితమైన దాడులు చేసిందని అన్నారు.

అయితే... ఆపరేషన్ సిందూర్ కు ప్రతిస్పందనగా పాక్ సైన్యం మాత్రం భారత పౌరులను, ప్రార్థనా స్థలాలను లక్ష్యంగా చేసుకుందని రాజ్ నాథ్ తీవ్రంగా విమర్శించారు. తాము మాత్రం ఉగ్రవాద మౌలిక సదుపాయాలపైనే ఖచ్చితంగా గురిచూసి కొట్టామని తెలిపారు. తాము పాక్ పౌరులను ఏనాడూ లక్ష్యంగా చేసుకోలేదని స్పష్టం చేశారు.

ఈ విధంగా ఆపరేషన్ సిందూర్ తో ఉగ్రవాదంపై పోరాడటానికి భారత్ ఇప్పుడు శత్రువుల భూభాగంలోకి లోతుగా వెళ్లి దాడి చేయగలదని ప్రపంచానికి చూపించిందని రాజ్ నాథ్ సింగ్ అన్నారు. ఉగ్రవాదంపై జీరో టాలరెన్సీ విధానాన్ని అనుసరిస్తున్నట్లు మోడీ స్పష్టం చేశారని చెప్పుకొచ్చారు.

# ఐరన్ లేడీ...ఇందిరను అంతా గుర్తు చేసుకుంటున్నారు!



**హైదరాబాద్ పెన్ పవర్:**గత కొద్ది రోజులుగా భారత్ పాకిస్థాన్ ల మధ్య సరిహద్దులలో ఘర్షణలు దాడులు జరిగాయి. చివరికి కాల్పుల నిలుపుదలతో అవి ముగిసాయి. అయితే దీని మీద అనేక రకాలైన భిన్న స్వరాలు వినిపిస్తున్నాయి. పాక్ ని దెబ్బకొట్టే మంచి చాన్స్ పోయింది అని కొందరు అంటూంటే యుద్ధం భారత్ విధానం కాదని మరి కొందరు అంటున్నారు. యుద్ధం కాదు చర్చలు అని తాను ముందే చెప్పాను అని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ కూడా రియాక్టు అయ్యారు.

ఇవన్నీ ఒక ఎత్తు అయితే పాక్ తో భారత్ కి యుద్ధం అన్నది ఇప్పటిది కాదు గతంలో చాలా జరిగాయి. అయితే 1971లో మాత్రం జరిగిన యుద్ధంతో భారత్ చరిత్ర పుటలలో నిలిచిపోయే ఘన విజయం అందుకుంది. ఆ యుద్ధంలో ఏకంగా పాక్ ని రెండు ముక్కలు చేసింది ఐరన్ లేడీ ఆనాటి ప్రధాని శ్రీమతి ఇందిరాగాంధీ. అంతే కాదు ఒక వైపు అమెరికా మరో వైపు చైనా ఇంకో వైపు బ్రిటన్ కలసికట్టుగా పాకిస్థాన్ ని మద్దతుగా నిలిచినా ప్రపంచంలో భారత్ ని ఒంటరి చేసినా ఆమె వెరవలేదు, బెదరలేదు. భారత్ శౌర్యమేంటో చూపించారు.

పాక్ ని ఓడించడమే కాదు అగ్ర రాజ్యం అమెరికాకు భారత్ అంటే ఏమిటో రుజువు చేశారు. ఈ సందర్భంగా అమెరికాలోని వైట్ హౌస్ లో నాటి అమెరికా ప్రెసిడెంట్ రిచర్డ్ నిక్సన్ ఉన్నారు. పాక్ తో భారత్ ఉద్రిక్తతలు యుద్ధానికి దారి తీస్తున్న నేపథ్యంలో నిక్సన్ తో ఇందిరాగాంధీ భేటీ వైట్ హౌస్ లో జరిగింది.

ఈ సందర్భంగా భారత్ విధానాన్ని ఇందిరాగాంధీ నిక్సన్ ని కుండబద్దలు కొట్టినట్లుగా చెప్పారు. తమది స్వతంత్ర దేశమని తమ అభిప్రాయాలు తమకు ఉన్నాయని ఏ ఇతర దేశమూ తమను శాసించలేదని ఆమె కరాఖండీగా స్పష్టం చేశారు. అంతే కాదు భారత్ కి అమెరికా ఒక ముఖ్య మిత్రుడు మాత్రమే బాస్ కాజాలరని ఆమె ఘాటుగానే జవాబు చెప్పారుట. అమెరికా తాను పాక్ ఇండియా ఇష్యూలో జోక్యం చేసుకోవడానికి ఆసక్తి చూపి భారత్ ని నిలువరించే ప్రయత్నం చేసినపుడు ఐరన్ లేడీ ఇందిరా గాంధీ అగ్ర రాజ్యానికి ధీటుగా ఇచ్చిన బదులు ఇది.

అంతే కాదు పాకిస్థాన్ తో యుద్ధం ప్రకటించాక అమెరికా పాకిస్థాన్ కి అత్యంత శక్తివంతమైన ఆయుధాలను సమకూర్చిపెట్టింది. భారత్ కి ఇంధనం సరఫరా కాకుండా అడ్డుపడింది. భారత్ కి ఏ సాయం అందకుండా ఇతర దేశాలను తన శక్తియుక్తులతో భయపెట్టింది. అయినా ఇందిరాగాంధీ వెరవలేదు, వెనకడుగు వేయలేదు. ఎవరీ అమెరికా మా మీద శాసించడానికి అనుకున్నారు. తానుగా యుద్ధం చేశారు. ఏకంగా లక్షన్నర మంది దాకా పాక్ సైనికులను బంధీలుగా పట్టుకున్నారు. పాక్ భూభాగంలోకి ప్రవేశించి మరీ లాహోర్ దాకా పాక్ సేనలను తరిమి కొట్టారు. తూర్పు పాకిస్థాన్ స్వతంత్ర కాంక్షను అర్థం చేసుని బంగ్లాదేశ్ గా కొత్త దేశం ఆవిర్భావానికి కృషి చేశారు.

ఆనాడు ఆమెకు విపక్ష నేతగా ఉన్న వాజ్ పేయ్ నుంచి ఇతర రాజకీయ పార్టీల నుంచి ఎంతగానో సహకారం దక్కింది. ఇందిరను దుర్గామాత అని వాజ్ పేయ్ కొనియాడారు అంటే నాడు అధికార విపక్షాల మధ్య ఉన్న బంధం ఎంత గొప్పదో దేశ హితం కోసం ఎంతలా కలసి మెలసి పనిచేశారో అంతా ఇపుడు ఆలోచించాలి. ఇపుడు కూడా ఒక పరిమిత స్థాయిలో భారత్ పాక్ ల మధ్య యుద్ధం వచ్చింది. అమెరికా మధ్యవర్తిత్వంతో ఈ యుద్ధం ఆగిపోయింది. ఈ విషయాల నేపథ్యంలో ఆనాటి సంఘటనలను ఇందిరాగాంధీ తెగువను ఇపుడు అంతా మరోసారి గుర్తు చేసుకుంటున్నారు. అమెరికా పెద్దన్న పాత్ర రుచించని వారు ఇందిరాగాంధీ అమెరికాను ఎలా దూరం పెట్టిందో కూడా గుర్తు చేసుకుంటున్నారు. దటీజ్ ఇందిరా అని అంటున్నారు.

# ఎయిర్‌పోర్టులో కేఏ పాల్ హంగామా.. యుద్ధం ఆపేందుకు వెళ్తుంటే అడ్డుకున్నారంటూ వాదన





**హైదరాబాద్ పెన్ పవర్:**ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. తెలుగు రాష్ట్రాల ప్రజలతోనే కాదు అమెరికాలోనూ ఆయనకు మంచి పరిచయాలు ఉన్నాయి. ట్రెండ్‌కు తగ్గట్టు వార్తల్లో నిలవడం ఆయనకు వెన్నతో పెట్టిన విద్య. ఏదో ఒక వివాదాస్పద వ్యాఖ్యతోనో, వింత చేష్టతోనో నిత్యం వార్తల్లో ఉండాలని ఆయన ప్రయత్నిస్తుంటారు. ఆయనకు లక్షల్లో అభిమానులు ఉండొచ్చు.. అది వేరే విషయం. తాజాగా ఆయన ఎయిర్‌పోర్టులో అధికారుల చేతిలో అడ్డంగా బుక్కయ్యారు. తన దగ్గర అన్ని డాక్యుమెంట్లు ఉన్నా ఎందుకు ఆపుతున్నారంటూ అధికారులను నిలదీశారు. ఈ విషయాన్ని తన అభిమానులతో పంచుకున్నారు. అసలు ఎయిర్‌పోర్టులో ఏం జరిగింది? ఆయన టర్కీ ఎందుకు వెళ్తున్నారు? పూర్తి వివరాలను ఈ వార్తలో తెలుసుకుందాం. కేఏ పాల్‌ను ఎయిర్‌పోర్టులో అధికారులు అడ్డుకోవడం ప్రస్తుతం హాట్ టాపిక్‌గా మారింది. ఆయన స్వయంగా ఈ విషయాన్ని తన అభిమానులతో పంచుకున్నారు. తాను అన్ని సరైన పత్రాలు చూపించినప్పటికీ అధికారులు తనను ఎందుకు ఆపుతున్నారో అర్థం కావడం లేదని ఆయన వాపోయారు. అయితే, ఆయన టర్కీ ఎందుకు వెళ్తున్నారనే విషయంపై ఆయన ఒక విచిత్రమైన కారణం చెప్పారు. భారత్, పాకిస్తాన్ మధ్య జరుగుతున్న యుద్ధాన్ని ఆపడానికి తాను టర్కీ వెళ్తున్నానని ఆయన చెప్పుకొచ్చారు. కానీ, వాస్తవానికి శనివారం సాయంత్రమే ఇరు దేశాలు కాల్పుల విరమణకు అంగీకరించాయి. బహుశా ఈ విషయం కేఏ పాల్‌కు ఇంకా తెలికపోవచ్చు.

అయితే, అసలు ప్రశ్న ఏమిటంటే.. ఇండో-పాక్ మధ్య యుద్ధం ఆపడానికి కేఏ పాల్ టర్కీ ఎందుకు వెళ్లాలనుకుంటున్నారు? గత నాలుగు రోజులుగా జరుగుతున్న యుద్ధంలో పాకిస్తాన్‌కు టర్కీ డ్రోన్‌లను సరఫరా చేస్తోందని వార్తలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో కేఏ పాల్ టర్కీ వెళ్తున్నారని ఆయన మద్దతుదారులు అంటున్నారు. బహుశా టర్కీ అధ్యక్షుడు ఎర్డోగాన్‌తో మాట్లాడి, పాకిస్తాన్‌కు డ్రోన్‌ల సరఫరాను నిలిపివేయమని కోరడానికి ఆయన వెళు తున్నారని వారు భావిస్తున్నారు. కేఏ పాల్ తాను గత 37 సంవత్సరాలుగా ప్రపంచమంతా తిరుగుతున్నానని చెప్పారు. గత వారం కూడా తాను టర్కీలో ఉన్నానని అన్నారు. ఒకానొక సమయంలో తాను పాకిస్తాన్ కూడా వెళ్లాల్సి వచ్చిందని తెలిపారు. తనకు వీసా లేకుండానే ప్రపంచ దేశాలు ఆహ్వానం పలుకుతాయని ఆయన తన మనసులోని మాటను బయటపెట్టారు. తన వీసా, గ్రీన్‌కార్డులను కూడా అధికారులకు చూపించారు. అయితే, తొందరపాటులో ఆయన ఏదో ముఖ్యమైన డాక్యుమెంట్ తీసుకురావడం మరిచిపోయి ఉండవచ్చని కొందరు అంటున్నారు.

## పరువు మొత్తం పోయిందిగా.. ట్రంప్ గాలి తీసేస్తున్న భారతీయులు!



**హైదరాబాద్ పెన్ పవర్:**భారత్ – పాక్ మధ్య గత కొన్ని రోజులుగా ఉన్న ఉద్రిక్త పరిస్థితులు శనివారం సాయంత్రం నుంచి చల్లబడిన సంగతి తెలిసిందే. అందుకు కారణం తామే అని.. ఆ మధ్యవర్తిత్వలో రాత్రంతా సుదీర్ఘంగా చర్చలు జరిగాయని.. ఈ సమయంలో ఇరు దేశాలు మంచి నిర్ణయం తీసుకున్నాయని ట్రంప్ తెలిపారు. అప్పటికే పలువురు భారతీయులు రగిలిపోతున్నారని అంటున్నారు. ఈ సమయంలో మరో విషయంపై స్పందించారు డొనాల్డ్ ట్రంప్. ఇందులో భాగంగా.. ఇరు దేశాలతో కలిసి కాశ్మీర్ సమస్య పరిష్కారం కోసం కృషి చేస్తానని తన సోషల్ మీడియా వేదికగా వెల్లడించారు. ప్రస్తుత సంఘర్షణతో మరణాలు, విధ్వంసం తప్ప ఏమీ లేవని భారత్, పాక్ లోని శక్తివంతమైన నాయకత్వాలు అర్థం చేసుకున్నందుకు గర్వంగా ఉందని అన్నారు. ఈ నేపథ్యంలోనే.. కశ్మీర్ విషయంలో పరిష్కారాన్ని మీరు కనుక్కోగలిగితే మీతో కలిసి పనిచేస్తానని ట్రంప్ అన్నారు. దీంతో.. భారతీయుల నుంచి తీవ్ర ఆగ్రహం వ్యక్తం అవుతోంది. ఇందులో భాగంగా... ఏదైనా చేయాలనుకుంటే మీకున్న సామర్థ్యంతో ఉగ్రవాదుల ఏరివేతలో భారత్ కు సహకరించాలని.. అంతే తప్ప, భారత అంతర్గత వ్యవహారాల్లో వేలు పెట్టొద్దని సూచిస్తున్నారు. కాల్పుల విరమణలో తందానతాన అన్నారని ఇక అన్ని విషయాల్లోనూ వేలు పెట్టేస్తామంటే సహించమని సోషల్ మీడియా వేదికగా స్పందిస్తున్నారు. కాశ్మీర్ ఎప్పటికీ భారత్ లో అంతర్భాగమే అని, ఆ సమస్యను ఎలా పరిష్కరించుకోవాలో భారతీయులకు బాగా తెలుసని నెటిజన్లు అమెరికా అధ్యక్షుడిపై మండిపడుతున్నారు.


**పాకిస్థాన్ లో తుపాకులతో సంబరాలు!:**

భారత్ కాల్పుల విరమణకు అంగీకరించడం తమ విజయమని, చారిత్రక విజయమని, పాకిస్థాన్ ను ఎవరైనా సవాల్ చేస్తే వారిని విడిచిపెట్టే ప్రసక్తే లేదని, భారత్ కు తగిన బుద్ధి చెప్పామని, తమ జోలికి వస్తే ఏం చేయగలమో చేసి చూపించామని చెప్పుకుంటున్నారు పాక్ ప్రధాని! దీంతో.. ఆ దేశంలో ప్రజలు భారత్ పై గెలిచామనే ఆనందంలో సంబరాలు చేసుకుంటున్నారు! ఇందులో భాగంగా... పాకిస్థాన్ వీధుల్లో కొంతమంది రాకెట్ లాంచర్లు, ఏకే-47 తుపాకులు చేతపట్టి ర్యాలీలు తీస్తున్నారు. ఈ సందర్భంగా భారత్ కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్నారని అంటున్నారు! దీనిపై నెటిజన్లు మండిపడుతున్నారు. ఇది పాకిస్థాన్ ఒరిజినల్ స్వరూపం అని.. ఇది తెలిసి కూడా ట్రంప్ మధ్యవర్తిత్వం చేశారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

## అంతా 'సోషల్' యుద్ధమే.. నిజానికి జరిగింది ఇదీ

**హైదరాబాద్ పెన్ పవర్:**గత నాలుగు రోజుల పాటు భారతదేశం – పాకిస్తాన్ మధ్య నెలకొన్న సైనిక ప్రతిష్టంభన, వాస్తవానికి ఒక పరిమిత స్థాయి సంఘర్షణగానే మిగిలిపోయింది. ఈ స్వల్ప వ్యవధిలో ఇరు దేశాల సైనిక అధికారులు రోజువారీ పత్రికా ప్రకటనలు.. విలేకరుల సమావేశాల ద్వారా సమాచారాన్ని అందించారు. అయితే ఈ సమయంలో సోషల్ మీడియా వేదికలు పరిస్థితిని తీవ్రంగా వక్రీకరించి, పూర్తిస్థాయి యుద్ధం చెలరేగిందనే భ్రమని కలిగించాయి. వాస్తవాలకు , కట్టుకథలకు మధ్య తేడాను గుర్తించడం అనేకసార్లు సవాలుగా మారింది. పాకిస్తానీ సోషల్ మీడియా ఛానెల్స్ ఇండియన్ జెట్‌లు , ఎయిర్‌స్ట్రిప్‌లు ధ్వంసమయ్యాయని పెద్దఎత్తున ప్రచారం చేశాయి. అయితే అలాంటి సంఘటనలు ఏవీ వాస్తవంగా జరగలేదు. అదేవిధంగా, ఇండియన్ సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లు కరాచీ పోర్ట్‌పై బాంబు దాడి జరిగిందని , రావల్పిండిలో విద్యుత్ సరఫరా నిలిచిపోయిందని నిరాధారమైన వార్తలను వ్యాప్తి చేశాయి.

## నమ్మిన వ్యక్తి మోసం చేశాడు... కానీ జాక్ పాట్ రూపంలో అదృష్టం వరించింది!




**హైదరాబాద్ పెన్ పవర్:**యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ)లో నివసిస్తున్న కేరళకు చెందిన 52 ఏళ్ల వ్యక్తికి అదృష్టం తలుపుతట్టింది. దుబాయ్ డ్యూటీ ఫ్రీ నిర్వహించిన మిలీనియం మిలియనీర్ డ్రాలో ఆయన ఏకంగా 1 మిలియన్ అమెరికన్ డాలర్లు (సుమారు రూ. 8.5 కోట్లు) గెలుచుకున్నారు. తీవ్ర ఆర్థిక ఇబ్బందులు, నమ్మినవారి మోసంతో సతమతమవుతున్న తరుణంలో ఈ జాక్‌పాట్ తగలడం తనకు ప్రాణదాతలాంటిదని ఆయన ఆనందం వ్యక్తం చేశారు. యూఏఈలోని అజ్మాన్‌లో నివసిస్తున్న వేణుగోపాల్ ముల్లచ్చేరి, వృత్తిరీత్యా ఐటీ సపోర్ట్ స్పెషలిస్ట్. గత 15 సంవత్సరాలుగా ఆయన దుబాయ్ డ్యూటీ ఫ్రీ లాటరీలో తన అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. ఏప్రిల్ 23న కుటుంబ సభ్యులను కలిసేందుకు భారతదేశం వచ్చి తిరిగి వెళుతున్న సమయంలో దుబాయ్ విమానాశ్రయంలో ఆయన కొనుగోలు చేసిన టికెట్‌కు ఈ భారీ మొత్తం దక్కింది. ఈ గెలుపుతో, దుబాయ్ డ్యూటీ ఫ్రీ మిలీనియం మిలియనీర్ డ్రా చరిత్రలో వేణుగోపాల్ 500వ విజేతగా నిలిచారు. ఈ జాక్‌పాట్ గెలుపు తన జీవితంలో ఒక పెద్ద భారాన్ని దించినట్లు అనిపించిందని ఖలీజ్ టైమ్స్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ముల్లచ్చేరి తెలిపారు. "ఈ విజయం నా జీవితంలోని ఒక కష్టతరమైన అధ్యాయానికి ముగింపు పలికి, ఆశ మరియు ఆనందంతో నిండిన కొత్త అధ్యాయానికి నాంది పలికింది," అని ఆయన పేర్కొన్నారు. గతంలో తాను ఎదుర్కొన్న కష్టాలను గుర్తుచేసుకుంటూ, ఇటీవల ఒక ఇల్లు నిర్మించడం వల్ల తీవ్రమైన ఆర్థిక ఒత్తిళ్లను ఎదుర్కొన్నానని ముల్లచ్చేరి వెల్లడించారు. దీనికి తోడు, తాను ఎంతగానో నమ్మిన వ్యక్తి చేసిన మోసం పరిస్థితిని మరింత దిగజార్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. "ఇలాంటి సమయంలో ఈ జాక్‌పాట్ రావడం నిజంగా దేవుడిచ్చిన వరంలాంటిది," అని ఆయన అన్నారు. ఇద్దరు పిల్లల తండ్రి అయిన వేణుగోపాల్, ఈ డబ్బుతో ముందుగా తన అప్పులన్నీ తీర్చేసి, కుటుంబంతో కలిసి విహారయాత్రకు వెళ్లాలని యోచిస్తున్నట్లు తెలిపారు. "ఇంకా అన్ని విషయాలపై నిర్ణయం తీసుకోలేదు, కానీ కచ్చితంగా కొంతకాలం విరామం తీసుకుని నా ఆత్మీయులతో సమయం గడుపుతాను. ఆ తర్వాత యూఏఈకి తిరిగి వచ్చి, ఒక వ్యాపారం ప్రారంభించి, నా కుటుంబాన్ని కూడా ఇక్కడికి తీసుకురావాలని ఆశిస్తున్నాను. యూఏఈ నా హృదయానికి చాలా దగ్గరైన ప్రదేశం... ఇక్కడ కాకుండా మరెక్కడా జీవించడాన్ని నేను ఊహించలేను" అని ఆయన వివరించారు.

## ఐపీఎల్ రీ స్టార్ట్.. ఇదిగో ఈ తేదీ నుంచే..

**హైదరాబాద్ పెన్ పవర్:**ఏకధాటిగా 57 మ్యాచ్ ల పాటు సాగిన ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 18వ సీజన్ పై భారత్–పాకిస్థాన్ ఉద్రిక్తతల ప్రభావం పడింది. యుద్ధ వాతావరణంలో లీగ్ నిర్వహణ సరికాదని భావించి వాయిదా వేశారు. దీంతో అభిమానులంతా తీవ్ర నిరుత్సాహానికి గురయ్యారు. ఇలాంటి సమయంలో అనూహ్యంగా శనివారం భారత్–పాక్ కాల్పుల విరమణకు అంగీకరించడంతో పరిస్థితులు చల్లబడ్డాయి. ఆ వెంటనే ఐపీఎల్ నిర్వహణకు అడ్డంకులు తొలగినట్లు స్పష్టమైంది. గత గురువారం పంజాబ్ కింగ్స్–ఢిల్లీ క్యాపిటల్స్ మధ్య హిమాచల్ ప్రదేశ్ లోని ధర్మశాలలో జరుగుతున్న 58వ మ్యాచ్ ను అర్థంతరంగా నిలిపివేశారు. ప్రేక్షకులను పంపించేసి.. మ్యాచ్ ను ఆపివేశారు. సహజంగా మ్యాచ్ రద్దయితే రెండు జట్లకు చెరో పాయింట్ ఇస్తారు. ఇక్కడ అది కూడా చేయలేదు. శుక్రవారం లక్నోలో లక్నో సూపర్ జెయింట్స్–రాయల్ చాలెంజర్స్ బెంగళూరు మ్యాచ్ నుంచి లీగ్ ఆగిపోయింది. శనివారం హైదరాబాద్ ఉప్పల్ మైదానంలో సన్ రైజర్స్ హైదరాబాద్–కోల్ కతా నైట్ రైడర్స్ మధ్య మ్యాచ్ జరగాల్సి ఉంది. శుక్రవారమే లీగ్ ను వారం పాటు వాయిదా వేస్తున్నట్లు కథనాలు వచ్చాయి. భారత్–పాక్ ఉద్రిక్తతలు చల్లారడంతో తాజాగా తెలుస్తున్న సమాచారం ప్రకారం ఐపీఎల్ పున:ప్రారంభం ఎప్పుడో తేలిపోయింది. ఈ నెల 15 నుంచి లీగ్ మళ్లీ మొదలు కానుంది.

# మత్తు వైద్యులు కాదు.. 'మత్తు'లో వైద్యులు.. తెలంగాణలో మరీ ఇంతమందా?



**హైదరాబాద్ పెన్ పవర్:**'మత్తు'.. ఇది ఎంతకైనా దారితీస్తుంది. ఒక్కసారి అలవాటైతే అంత తొందరగా వదలదు.. జీవితాన్ని నాశనం చేసేవరకు తీసుకెళ్తుంది.. అది మద్యం అయినా ధూమపానం అయినా.. డ్రగ్స్ అయినా.. ఇప్పుడు సమాజంలో మద్యం, ధూమపానం కంటే డ్రగ్స్ వ్యసనం అధికం అయింది. తాజాగా హైదరాబాద్ కు చెందిన కేవలం 34 ఏళ్ల వయసున్న ఓ యువ వైద్యురాలు డ్రగ్స్ కు బానిస కావడం.. ఏడాదిలో రూ. 70 లక్షల డగ్స్ కొన్నట్లు వస్తున్న కథనాలు అత్యంత సంచలనం రేపుతున్నాయి. పైగా ఈమె ఓ పెద్ద ఆస్పత్రి ఓనర్ కుమార్తె. ఆంకాలజీలో ఎండీ చేసిన ఆమె.. ఎంబీఏ కోసం స్పెయిన్ కు వెళ్లి సందర్భంలో డ్రగ్స్ కు బానిస అయినట్లు తెలుస్తోంది. హైదరాబాద్ కు వచ్చాక వైద్యురాలికి డ్రగ్స్ వ్యసనం మరింత తీవ్రమైంది. ముంబైకి చెందిన వ్యక్తి ద్వారా డ్రగ్స్ కొంటూ పట్టుబడింది. ఆమె ఉదంతం తర్వాత చూస్తే.. హైదరాబాద్ సహా తెలంగాణ వ్యాప్తంగా రెండేళ్లలో 20 మంది వైద్యులు డ్రగ్స్ కు బానిస అయినట్లు గణాంకాలు చెబుతున్నాయి. వీరిలో కొందరు రిహాబిలిటేషన్ సెంటర్ ల ద్వారా మత్తు వ్యసనం నుంచి బయటపడ్డారు. కొందరు వైద్యులు ప్రైవేటు హాస్పిటల్స్ దగ్గర మెడికల్ షాప్ లు ఏర్పాటు చేసి.. సర్జరీలకు వాడే మత్తు ఇంజక్షన్లు, నొప్పులతో బాధపడే వారికి ఇచ్చే మత్తు ఇంజక్షన్లను మత్తు బానిసలకు విక్రయిస్తున్నట్లు తేలింది. హైదరాబాద్ ధూల్ పేట పెడ్లర్ వద్ద 10 మంది మెడికోలు గంజాయి కొంటున్నట్లు కూడా ఆ మధ్య బయటపడింది. వీరంతా చదువుల ఒత్తిడి, ఫ్రెండ్స్ ప్రభావం, అప్పటివరకు అనుభవించని స్వేచ్ఛ హాస్టల్ లో లభించడంతో తాము డ్రగ్స్ కు అలవాటైనట్లు చెప్పారు. హైదరాబాద్ లో ఓ వైద్యుడు అయితే తాను పని ఒత్తిడి నుంచి ఉపశమనానికి డ్రగ్స్ తీసుకుంటున్నట్లు చెప్పాడు. డ్రగ్స్ వాడుతున్న ప్రైవేటు ఉద్యోగులు, ఐటీ నిపుణులు కూడా పని ఒత్తిడినే సాకుగా చూపుతుండడం గమనార్హం. ఇక మత్తు పదార్థాల నుంచి దూరంగా ఉండాలని, మత్తు బానిసలకు వైద్యం చేసే వైద్యులే మత్తుకు బానిసలు కావడం సంచలనం రేపుతోంది.

**యోగా, ధ్యానం, స్పోర్ట్స్ అసలైన 'మత్తు' ఇది..**

పని ఒత్తిడి నుంచి ఉపశమనం పొందడానికి మత్తును ఆశ్రయించడం కంటే పొరపాటు ఇంకోటి లేదు. రేపు మరింత పని ఒత్తిడి ఉంటే మరింత మత్తు తీసుకుంటారా? అనేది ఆలోచించాలి. అంతేకాదు.. మత్తు శరీరాన్ని నిస్సత్తువ చేస్తుంది. ప్రొడక్టివిటీని తగ్గించేస్తుంది. జీవితంలో మధుర క్షణాలను అనుభవించకుండా చేస్తుంది. చివరకు రోగిని చేస్తుంది.. మరి ఒత్తిడి నుంచి రిలీఫ్ ఎలా అంటారా? యోగా, వ్యాయామం, స్పోర్ట్స్, ధ్యానం, గార్డెనింగ్ ఇలా చాలా మార్గాలు ఉన్నాయి. ఇవి మంచి చేసే 'మత్తు' అన్నమాట. కాకపోతే అలవాటు కావడానికి చాలా సమయం పడుతుంది. ఒక్కసారి అలవాటైతే వదలరు. ముఖ్య విషయం..: యోగా, స్పోర్ట్స్, వ్యాయామం చేసేవారిని చూడండి.. 90 శాతం మంది వ్యసనాలకు దూరంగా ఉంటారు. ఒకవేళ దురలవాట్లు ఉన్నా.. చాలా పరిమితంగానే. అందుకే ఏది మంచో ఏది చెడో గమనించండి.

## ఆపరేషన్ సిందూర్ కొనసాగుతుంది.. వాయుసేన కీలక ప్రకటన!



**హైదరాబాద్ పెన్ పవర్:**పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ సిందూర్ కొనసాగుతుందని సైన్యం ఓ ప్రకటనలో వెల్లడించింది. ఈ విషయంలో కేంద్రం నుంచి వచ్చే ఆదేశాలను తాము తూ.చ. తప్పకుండా పాటిస్తున్నట్టు తెలిపింది. అయితే.. ఈ క్రమంలో సోషల్ మీడియాలో వచ్చే వార్తలను విశ్వసించవద్దని, తామే దీనిపై బ్రీఫింగ్ ఇస్తామని సైన్యం ప్రకటించింది. వాస్తవానికి శనివారం సాయంత్రం 5 గంటల తర్వాత భారత్ %-% పాక్ లు కాల్పుల విరమణ అవగాహనకు వచ్చినట్టు ఇరు దేశాలు ప్రకటించాయి. మరోవైపు తాము మధ్యవర్తిత్వం చేశామని.. ఇరు దేశాలు కాల్పుల విరమణకు అంగీకరించాయని అగ్రరాజ్యం అమెరికా ప్రకటించింది. అయితే.. ఇది జరిగిన నాలుగు గంటల తర్వాత.. అనూహ్యంగా పాక్ వైపు నుంచి కవ్వింపులు ప్రారంభమయ్యాయి. ఈ నేపథ్యంలోనే స్పందించిన వాయుసేన... ఆపరేషన్ సిందూర్ కొనసాగుతుందని తెల్లిపింది. అద్భుతమైన నైపుణ్యాలతో, అత్యంత కచ్చితత్వంతో తమకు అప్పగించిన బాధ్యతను పూర్తి చేసినట్లు పేర్కొంది. అయితే.. ఆపరేషన్స్ ఇంకా కొనసాగుతున్నందున అధికారికంగా వివరాలు వెల్లడిస్తామని.. అప్పటి వరకూ తప్పుడు సమాచారాని దూరంగా ఉండాలని ఎక్స్ లో పోస్ట్ పెట్టింది. ఇక,

ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ.. ఆదివారం ఉదయం 10 గంటలకు అత్యున్నత స్థాయి సమావేశం నిర్వహించారు. భారత్ – పాక్ సరిహద్దుల వెంబడి ఉన్న ప్రస్తుత పరిస్థితులు.. అమెరికా జోక్యం.. భవిష్యత్తు వ్యూహాలు.. వంటి కీలక విషయాలపై వర్చించినట్లు తెలుస్తోంది. భారత సైన్యానికి ఫ్రీ హ్యాండ్ ఇచ్చిన దరిమిలా.. ప్రధాని నిర్వహించిన సమావేశం కీలకంగా మారింది. అయితే.. దీనిలో ఏయే విషయాలు చర్చించారన్నది తెలియాల్సి ఉంది. మరోవైపు.. తాము సర్వసన్నద్ధంగా ఉన్నామని వైమానిక దళం అధికారులు కూడా ప్రకటించారు! అయితే.. మళ్లీ పాక్ కవ్వింపులకు పాల్పడినట్లు ఎక్కడా ఎలాంటి సంఘటనా తెరపైకి రాలేదు. ఏది ఏమైనా... కాల్పుల విరమణకు అంగీకరించామంటూనే ఆపరేషన్ సిందూర్ కొనసాగుతుందని సైన్యం చెప్పడంపై మరింత స్పష్టత రావాల్సి ఉందని అంటున్నారు!